ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 18, అక్టోబరు 2025


రాకెట్ ప్రయోగ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు


9

ఉత్సాహంగా యువజనోత్సవం

జిల్లాస్థాయి యువజనోత్సవాన్ని ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఏడు అంశాల్లో వివిధ పోటీలు ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొందరు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువతే వెన్నుముక అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న వై.నిహారిక

సైన్స్ సెమినార్.. సూపర్!

విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రతిభను చాటారు. వై.నిహారిక (జడ్పీ హైస్కూల్, అలకూరపాడు), బి.హిమవర్షిత (ఏపీ మోడల్‌స్కూల్, దర్శి), పి.మధులత (జడ్పీ హైస్కూల్, కొలచనకోట), జి.నస్సీ (జడ్పీ హైస్కూల్, త్రోవగుంట) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ స్థానాల్లో నిలిచారు. వివరాలు 9వ పేజీలో..



కలెక్టర్‌ను కలిసిన జైళ్లశాఖ డీఐజీ

కలెక్టర్ పి.రాజాబాబును జైళ్లశాఖ గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జైళ్లకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.
- ఒంగోలు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కె.శ్రీధర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నలుగురు ఎస్‌డీసీలకు స్థానచలనం కల్పించగా వారిలో శ్రీధర్‌రెడ్డి కూడా ఉన్నారు.

నెరవేరని లక్ష్యం!

పులి పిల్లలకు అటవీ సంస్కృతి అలవాటు ఎండమావి..

- అవి ఎదిగేందుకు నల్లమలలో ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభించి.. ఆపై నిలిపివేత
- ఇక్కడ దొరికిన పిల్లలు తిరుపతిలోని జూకు తరలింపు
- ఖర్చుపెట్టిన రూ.లక్షలు వృథా

9



సులభంగా.. వేగంగా..

భూమార్పిడికి నూతన విధానం

నగరంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు గతంలో వ్యవసాయేతర భూమిలో వెంచర్ వేయాలని నిర్ణయించుకున్నారు. ఆ భూమికి అవసరమైన కన్వర్షన్ కోసం తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరిగారు. అయినా సమయానికి పనికాకపోవడంతో అధికారులకు కొంత సమర్పించాల్సి వచ్చింది. ప్రజా ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న నాలా చట్టాన్ని మార్పు చేసి ఈడీసీ విధానాన్ని తీసుకురావడంతో ఆ సమస్యకు పరిష్కారం లభించింది. భూమి విలువలో ఫీజు గతంలో 5 శాతం ఉండగా, దానిని 4 శాతానికి తగ్గించింది. కన్వర్షన్ అధికారాన్ని సింగిల్ విండో పద్ధతిలో మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలకు అప్పగించడంతో ఇకపై వారం రోజుల్లోనే ప్రక్రియ పూర్తికానుంది.

స్థిరాస్తి రంగానికి ఊతం

స్థానిక సంస్థలకు కొత్త రూపు..!

'నాలా' బదులుగా ఈడీసీ విధానం

కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో అభివృద్ధికి సువర్ణావకాశం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : భూమార్పిడి సులభతరమైంది. రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించడంతోపాటు స్థానిక సంస్థలకు కొత్త రూపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్ (నాలా) చట్టాన్ని రద్దు చేసింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతరంగా మార్చేందుకు ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్ (ఈడీసీ) విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీనిపై ఇటీవల ప్రత్యేక జీవో కూడా విడుదల చేసింది. ఇకపై కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలతోపాటు గ్రామ పంచాయతీలలోనూ టౌన్ ప్లానింగ్ చట్టం-1920 అమలు చేయాలని ఆదేశించింది. 2006 జనవరి 2కు ముందు ప్లాట్లుగా చేసిన భూములకు ఈ చట్టం వర్తించదని స్పష్టం చేసింది. కొత్త విధానంలో నిధులు మొత్తం మునిసిపాలిటీలలోని మౌలిక సదుపాయాల



మిగతా 8లో...



నిర్లక్ష్యానికి మూల్యం తప్పదు

- రోగుల పట్ల గౌరవంగా ఉండాలి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు సిబ్బందిని హెచ్చరిం చారు. శుక్రవారం 'సేవలు తూతూమంత్రం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆసుపత్రి సిబ్బందిపై ప్రత్యేక పరిశీలన ఉంటుందన్నారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో నర్సుల పనితీరును పరిశీలించాలని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలతను సూపరింటెండెంట్ ఆదేశించారు. దీంతో ఆమె క్యాజువాలిటీతోపాటు, వార్డుల్లో విధులు నిర్వర్తిస్తున్న నర్సింగ్ సిబ్బంది పనితీరుపై విచారణ చేపట్టారు. వారిపై పదేపదే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆమె తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. రోగుల పట్ల ప్రేమ, మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. అత్యవసర చికిత్స కోసం వచ్చే వారి పట్ల నిర్లక్ష్యంగా, కఠినంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం రోగులతో ఆమె మాట్లాడారు. ఎలాంటి అసౌకర్యం కలిగినా నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మరుగుదొడ్లు శుభ్రమయ్యాయ్..

- దూపాడులో మంత్రి వచ్చి వెళ్లాక గురుకులంలో మారిన రూపురేఖలు

8



విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించను

- నిధుల వినియోగంలో జాప్యమైతే సస్పెండ్ చేస్తా
- కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక

8

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- ఒంగోలు సబ్‌డివిజన్‌లో 82 దుకాణాలు
- లైసెన్స్‌లు లేకుంటే చట్టపరమైన చర్యలు : డీఎస్పీ

9

జల్లులు.. చలిగాలులు

- ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో మారిన వాతావరణం
- దక్షిణ ప్రాంతంలో భారీ వర్షం
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం

ఒంగోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం కనిపిస్తోంది. రెండు రోజుల నుంచి జల్లులు పడుతున్నాయి. ప్రత్యేకించి జిల్లాకు దక్షిణ ప్రాంతంలో ఉండే పలు మండలాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఇతర చోట్ల ఒక మోస్తరుగా పడింది. శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో సగటున 14.70 మి.మీ వర్షపాతం నమోదైంది. పొన్నలూరు మండలంలో అత్యధికంగా 80.0 మి.మీ కురిసింది. కనిగిరి నియోజకవర్గంతోపాటు ఒంగోలు పరిసర ప్రాంత మండలాల్లోనూ ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. మరోవైపు చలిగాలులు వీస్తున్నాయి. సాధారణంగా బంగాళాఖాతంలో వాయుగుండం, తుఫాన్‌ల సమయంలో ఉండే వాతావరణం నెలకొంది. వారం రోజుల నుంచి జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో ఒక మోస్తరు వానలు పడుతూనే ఉన్నాయి. ఈనెలలో 205 మి.మీ సాధారణ వర్షపాతం కాగా ఈ సమయానికి 117.30 మి.మీ కురవాల్సి ఉంది. కానీ 82.30 మి.మీ మాత్రమే కురిసినట్లు అధికార గణాంకాలను బట్టి తెలుస్తోంది.

ఇటు అధికం.. అటు లోటు

పశ్చిమప్రాంత మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నప్పటికీ తూర్పు, దక్షిణ ప్రాంత మండలాల్లో సాధారణం కన్నా అధికంగానే కురిసింది. వారం రోజులుగా నిత్యం జల్లులు పడుతుండటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అధిక ప్రాంతాల్లోని గ్రామాల్లో వీధుల్లోకి మురుగు చేరింది. పట్టణాల్లోని పలు శివారు కాలనీల్లోనూ అలాంటి పరిస్థితే నెలకొంది. దీపావళి సమయానికి సాధారణంగా వర్షాలు అధికంగా ఉంటాయి. ప్రస్తుత వాతావరణంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో పలు రకాల జ్వరాలు, జలుబు, దగ్గు ఇతరత్రా వ్యాధుల దాడి మొదలైంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పెరిగిన రోగుల సంఖ్యను బట్టి ఈ విషయం అర్థమవుతోంది.

14.7 మి.మీ సగటు వర్షపాతం

జిల్లాలో శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 14.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పొన్నలూరు

మిగతా 8లో...



45 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



కోతలు మొదలైన వెంటనే ప్రారంభం

జిల్లాలో 15వేల మెట్రిక్ టన్నులు సేకరిస్తాం

అధికారుల సమావేశంలో జేసీ గోపాలకృష్ణ



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు 45 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు. వరి కోతలు మొదలైన వెంటనే వీటిని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతుల నుంచి 15వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. 25 మండలాల్లోని 185 రైతు సేవా కేంద్రాల పరిధిలో 45 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. హమాలీలు, గోనె సంచులు, తేమశాతం కొలిచే యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గత సీజన్‌లో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిసెంబరు నుంచి వరి కోతలు ప్రారంభమవుతున్నందున నవంబరు ఆఖరుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఏఒక్క రైతుకు ఇబ్బందిలేకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినందున అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. పౌరసరఫరాల అధికారులు మిల్లులను ట్యాగ్ చేయడం, బ్యాంకు గ్యారెంటీలు

మిగతా 8లో...

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకుమించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.





అద్దంకికి డయాలసిస్ సెంటర్, ఏఆర్టీ కేంద్రాల మంజూరు



మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గానికి డయాలసిస్, ఏఆర్‌టీ కేంద్రాలు మంజూరైనట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 5 బెడ్‌ల డయాలసిస్ సెంటర్, ఏఆర్టీ(యాంటీ రెట్రోవిరల్ థెరపీ కేంద్రం) మంజూరయ్యాయన్నారు. డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ రోగులకు, ఏఆర్టీ సెంటర్ ద్వారా హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. రెండు కేంద్రాలకు సంబంధించి భవనాల నిర్మాణం, ఆధునిక వైద్య పరికరాలు, వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగులు ఇప్పటి వరకు ఒంగోలు, గుంటూరు తదితర పట్టణాలకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. అద్దంకితో పాటు దర్శి నియోజకవర్గంలోని కిడ్నీ రోగులకు అద్దంకిలోనే డయాలసిస్ చేయించుకునే అవకాశం ఏర్పడుతుంది.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 కింద వేతనాలు ఇవ్వాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి



ఉద్యోగులతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ వీడియో సందేశాన్ని వినిపించారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, బకాయిలు విడుదల చేయాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరెడ్డి, సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎ.ప్రసాద్, ఎ.భాస్కరరావు, ధనమ్మ, జి.శాంసన్, వై.మృదుల్‌కుమార్, లక్ష్మి, కొడమల శాంసన్, గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అధ్యక్షుడు డీవీ.సుబ్బారెడ్డి, ఓబీవీ. సుబ్బారావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీ వల్లూరమ్మ దేవస్థానము - వల్లూరు
టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా.

ఈ ప్రొక్యూర్‌మెంట్ - సీల్డు టెండరు - బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వల్లూరమ్మ దేవస్థానములో ఈ క్రింద తెలిపిన ఐటములకు ఈ-ప్రొకూర్‌మెంట్ / సీల్డుటెండర్లు కం బహిరంగ వేలం తేది.30-10-2025న ఉ॥11.00గం॥లకు నిర్వహించబడును. ఈ టెండర్ కాలపరిమితి తేది.25-12-2025 నుండి 24-12-2026 వరకు మాత్రమే.

ఐటం. నెం.	పాటకు పెట్టుబడు ఐటముల వివరములు	ధరావత్తు రూ.లు
1.	భక్తులచే సమర్పించబడు చీరలు రవిక గుడ్డలు ప్రోగు చేసుకొను హక్కు	50,000/-

టెండరు షెడ్యూల్స్ జారీచేయు తేదీలు : ది.18-10-2025 నుండి తేది.29-10-2025 సా॥5.00 ల వరకు
టెండర్ షెడ్యూల్స్ దాఖలు చేయు ఆఖరు తేది.30-10-2025 ఉ॥9.00గంటల వరకు.
టెండరు షెడ్యూల్ ఖరీదు రూ500/-
ఈ-టెండరు బిడ్ డౌన్‌లోడ్ మొదలు తేది.18-10-2025 ఉ॥10.00గం॥లకు
బిడ్ స్వీకరించు చివరి తేది.29-10-2025 సా॥5.00గం॥ల వరకు
బిడ్ తెరచు తేది.30-10-2025 ఉదయం 11.00 గంటలకు.

ఈ-టెండరు వివరములు www.eprocurement.gov.in లో AP Endowments Department Marketing నందు చూడగలరు. మిగిలిన షరతులు దేవస్థానము కార్యాలయము నందు తెలుసుకొనవచ్చును.

వల్లూరు
తేది.17-10-2025

B.రమేష్, కార్యనిర్వహణాధికారి
సెల్: 7013429148

నిధుల వినియోగంలో జాప్యం చేస్తే సస్పెండే

- విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు
- కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ రాజాబాబు హెచ్చరించారు. మండల స్థాయిలో అభివృద్ధి అధికారులకు గ్రామాభివృద్ధే ప్రధాన కర్తవ్యం అని, నిర్లక్ష్యంచేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఎస్సీ ప్రజలు అధికంగా ఉండే గ్రామాల్లో పీఎం-ఏజేఏవై పథకం అమలు తీరుపై శుక్రవారం స్థానిక కలెక్టర్ సమావేశపు హాలులో జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా జిల్లా సాంఘికసంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ ఈపథకంలో భాగంగా గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, సామాజిక భద్రత, గ్రామీణ రోడ్లు, ఇళ్ల నిర్మాణం, విద్యుత్, మెరుగైన వ్యవసాయం తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై కలెక్టర్ స్పందిస్తూ వచ్చిన నిధులను వినియోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఫేజ్-1లో మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరును కూడా నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, బాలశంకరరావు, నారాయణ, కిరణ్‌కుమార్, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, అశోక్ పాల్గొన్నారు.

మంత్రి వచ్చాక మరుగుదొడ్లు శుభ్రమయ్యాయ్..

ఆ గురుకుల పాఠశాలలో లోపల ఎలా ఉంటుందో తెలియదు గాని బయటకు మాత్రం జాతీయ రహదారి వెంబడే ఆహ్లాదకర వాతావరణంలో కనిపిస్తోంది. కానీ గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ఆకస్మిక తనిఖీ చేసి పాఠశాలలో ఉన్న లోపాలు గుర్తించటంతో ఇప్పుడు అందరినోట ఆ పాఠశాల మాట వినబడుతోంది. అదే త్రిపురాంతకం మండలం దూపాడులోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల. మీడియాను, స్థానిక నాయకులను కూడా వెంట రానీయకుండా మంత్రి స్వయంగా పాఠశాల పరిస్థితిని పర్యవేక్షించి సిబ్బందిని హెచ్చరించి లోపాలు సరిదిద్దుకోవాలని, విద్యార్థినులకు ఇబ్బంది కలిగిస్తే సహించనని హితబోధ చేశారు. అంతే శుక్రవారం చకచకా లోపల నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను శుభ్రపరిచి, అల్లుకున్న నిర్లక్ష్యపు తీగలు, చెట్లు తొలగింపు చేపట్టి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. మంత్రి ఆదేశాలతో శుభ్రపరిచామని ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. అంటే మంత్రి వస్తేగాని మరుగుదొడ్లు శుభ్రం కావా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



తెలుగు వెలుగులు చాటిన గొట్టిపాటి రమణ

- ఖతార్‌లో తెలుగు ప్రవాసి సంఘ సభ్యుడిగా కామేపల్లి వాసి విజయం
- టీడీపీ ఎన్ఆర్ఐ విభాగంలో కీలక బాధ్యతలు



గొట్టిపాటి రమణ

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన గొట్టిపాటి రమణ గల్ఫ్‌లోని ఖతార్ దేశంలో ఉంటూ తెలుగు వెలుగులను చాటాడు. అక్కడ జరిగిన తెలుగు ప్రవాసీ సంఘం ఎన్నికల్లో తనతోపాటు మరో 9మందిని గెలిపించడంలో రమణ కీలకపాత్ర పోషించారు. తెలుగు వారికి అండగా, టీడీపీ విభాగంలో కీలకంగా పనిచేసే రమణ భారతీయ ఎంబసీ ఆధ్వర్యంలోని ఐసీసీ అనే భారతీయ సంఘాల సమాఖ్య పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరగ్గా విజయంలో రమణ కీలకపాత్ర పోషించారు.కామేపల్లి నుంచి 20 ఏళ్ల క్రితం ఖతార్ వెళ్లిన అక్కడ ప్రముఖ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. జిల్లాకు చెందిన అనేక మంది ఇంజనీర్లకు ఉద్యోగ ఉపాధి కల్పనలోనూ, పేదలకు విద్యనందించడంతోపాటు, ప్రభుత్వం చేపడుతున్న పలు కీలకమైన కార్యక్రమాలకు రమణ అండదండలు అందిస్తున్నారు. రమణకు ఇద్దరు కుమార్తెలు ఇక్కడనే వైద్య విద్యలో పీజీ చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన రమణ ఖతార్‌లో పేరు ప్రఖ్యాతులు సాధించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరులో నేత్రదానం

పంగులూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శుక్రవారం నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన పెంట్యాల వెంకటనారాయణ(ఉరఫ్ ముఖ్యమంత్రి) మరణించాడు. స్థానిక రోటరీక్లబ్ సహకారంతో కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఆ సమాచారాన్ని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావులు కాకాణికి చెందిన శంకర్ నేత్రాలయం వారికి తెలియజేశారు. పంగులూరు చేరుకున్న శంకర్‌కంటి వైద్యశాల సిబ్బంది మృతుడు వెంకటనారాయణ కంటి కార్నియాను సేకరించారు.

సులభంగా.. వేగంగా..

అవీఇవీ

(7వపేజీ తరువాయి)

కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, పార్కుల అభివృద్ధికి వినియోగించుకునేలా విధివిధానాలను రూపొందించింది. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసే బాధ్యతను ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల కమిషనర్లకు ప్రభుత్వం అప్పగించింది.

గతంలో ఇలా..

వ్యవసాయేతర భూములు కన్వర్షన్ చేసుకోవడానికి రియల్టర్లు, భూయజమానులు రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులకు ఎకరాకు ఇప్పటి వరకూ రూ.లక్ష వరకు మామూళ్లు సమర్పించుకోవాల్సి వచ్చేది. వ్యవసాయ భూమి స్వరూపం మార్చకుండా కనీసం చదును చేయకుండా నాలా కింద భూ మార్పిడికి దరఖాస్తు చేయాలన్నది నిబంధన. అయితే లే అవుట్‌లుగా మార్చిన తర్వాత ల్యాండ్ కన్వెర్షన్‌కు దరఖాస్తు చేసుకునేవారు. అలాంటి వాటికి సాధారణంగా భూమి విలువపై వసూలు చేసే 5 శాతం ఫీజుతోపాటు అదనంగా మరో 5 శాతం జరిమానాగా రాబట్టాల్సి ఉంటుంది. అయితే జరిమానా నగదును ప్రభుత్వానికి చెల్లించకుండా రెవెన్యూ అధికారులు ముడుపులుగా తీసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీంతో స్థిరాస్థి రంగానికి ఊతమిచ్చేలా స్థానిక సంస్థలకు కొత్త రూపు కల్పించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాలా చట్టాన్ని రద్దు చేసి ఇక నుంచి ఏకీకృత విధానంలో భూమి మార్పిడికి అనుమతులు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. గతంలో నాలా కింద చెల్లిస్తున్న 5 శాతం ఫీజును 4 శాతానికి తగ్గించడం రియల్టర్లకు ఉపయుక్తం కానుంది.

నూతన నిబంధనలు ఇలా

ఇదివరకు ల్యాండ్ కన్వర్షన్‌కు భూ విలువలో 9 శాతం ఫీజుగా వసూలు చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం దానిని మూడు శాతానికి తగ్గించి, మళ్లీ 5 శాతానికి పెంచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే మార్పులు చేయగా, పూర్తిస్థాయిలో ఉత్వర్వులు ఇటీవల అమలులోకి వచ్చాయి. గతంలో ల్యాండ్ కన్వెర్షన్‌కు ఆరు నెలలకుపైగా సమయం పట్టగా, తహసీల్దార్ వద్ద 14 రోజులు, ఆర్డీవో వద్ద 21 రోజుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా నిబంధనలు మార్పు చేసింది.

ఊపందుకోనున్న భూమార్పిడి ప్రక్రియ

నాలా చట్టాన్ని రద్దు చేసి, ఈడీసీ విధానం అమలులోకి తీసుకురావడంతో ల్యాండ్ కన్వెర్షన్ ప్రక్రియ ఊపందుకోనుంది. అనుమతులకు ఏకరూప ప్రక్రియకు తోడు, పట్టణాభివృద్ధి సంస్థల్లో ఎక్స్‌టర్నల్ డవలప్‌మెంట్ చార్జీలు వసూలుతో వచ్చే ఆదాయం మౌలిక వసతుల కల్పనకు వినియోగించేలా చర్యలు తీసుకోవడంతో 'స్థానిక' అభివృద్ధికి ఊతం లభించనుంది.

జల్లులు..చలిగాలులు

(7వపేజీ తరువాయి)

మండలంలో 88.0, జరుగుమల్లిలో 76.2, సింగరాయకొండలో 61.4, టంగుటూరులో 57.4, సీఎస్‌పురంలో 29.0, పొదిలిలో 24.6, పామూరులో 24.0 మి.మీ కురిసింది. పీసీపల్లిలో 22.8, అర్ధవీడులో 20.2, కొత్తపట్నంలో 16.4, కనిగిరిలో 15.0, కొండపిలో 12.8, రాచర్లలో 11.2, కొమరోలులో 10.6, దోర్నాలలో 10.2, వెలిగండ్లలో 10.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

45 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

(7వపేజీ తరువాయి)

తీసుకోవడం వంటివి వెంటనే పూర్తి చేయాలన్నారు. అన్ని మిల్లులు పనిచేస్తున్నది లేనిది తనిఖీ చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో ధాన్యం సేకరణ కమిటీలతో సమావేశాలు నిర్వహించి వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్‌ఓ పద్మశ్రీ, పౌరసరఫరాలశాఖ ఏడీ వరలక్ష్మి, మార్కెటింగ్ శాఖ ఏడీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని లక్ష్యం..!

పులి పిల్లలకు అటవీ సంస్కృతి అలవాటు ఎండమావి..

అలా ఎదిగేందుకు నల్లమలలో ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభం

అంతలోనే ఆగిన సంకల్పం

ఇక్కడ అడవిలో దొరికిన పిల్లలు

తిరుపతిలోని జూకు తరలింపు

అక్కడే బెబ్బులులుగా ఎదిగేంత వరకూ

అధికారుల నిర్లక్ష్యం

ఇక్కడ ఖర్చుపెట్టిన రూ.లక్షలు వృథా



నిరుపయోగంగా మారిన ఎన్‌క్లోజర్ సామగ్రి

పెద్దదోర్నాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : తల్లి నుంచి విడిపోయి అధికారుల సంరక్షణలో ఉన్న పులిపిల్లలకు అటవీ సంస్కృతిని అలవాటు చేసేందుకు చేపట్టిన ఎన్‌క్లోజర్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.దీంతో లక్ష్యం నెరవేరకపోగా లక్షల రూపాయల నిధులు వృథా అయ్యాయి. దాదాపు రెండేళ్ల క్రితం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడారం అటవీ సమీపంలో తల్లిని వీడి నాలుగు ఆడపులి పిల్లలు దిక్కుతోచని స్థితిలో స్థానికుల కంటబడ్డాయి. వారు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వాటిని తాత్కాలికంగా తిరుపతి జూపార్కుకు తరలించారు. అవి పెరిగి పెద్దవుతున్న క్రమంలో అటవీ ప్రాంత వాతావరణాన్ని కోల్పోతే సహజత్వాన్ని కోల్పోతాయని భావించిన ఆ శాఖాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

జరిగిందిదీ.. సహజత్వం పొందకుండానే బెబ్బులులుగా పరిణితి

అధికారుల సంరక్షణలోని పులి పిల్లలను అటవీ ప్రాంత వాతావరణానికి అలవాటు చేయాలన్న సంకల్పం ఆదిలోనే ఆగిపోయింది. తిరుపతి జూలోని పులి పిల్లలను నల్లమల అభయారణ్యంలోకి తీసుకొచ్చేందుకు చేపట్టిన ఎన్‌క్లోజరు నిర్మాణ పనులు ఏ కారణంతోనో అర్ధంతరంగా నిలిచిపోయాయి. నిర్మాణం కోసం లక్షల రూపాయలు వెచ్చించి తెచ్చిన వస్తు సామగ్రి దోర్నాల ఫారెస్టు గెస్టుహౌసులోనే తుప్పుపడుతున్నాయి. మరో పక్క పులుల ఆహారం కోసం ఎన్‌క్లోజరులో పెంచుతున్న జింకలు కూడా పెద్దవి అవడంతో అడవిలో వదిలేశారు. తిరుపతి జూలో పెరుగుతున్న నాలుగు పులి పిల్లల్లో ఒకటి అనారోగ్యంతో మృతి చెందినట్లు విశ్వసనీయ సమాచారం. ఉన్న మూడు పులి పిల్లలు అటవీ సహజత్వాన్ని పొందకుండానే బెబ్బులులుగా ఎదిగినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

నాకు ఆ పులుల విషయమే తెలియదు

షేక్ రహంతుల్లా, కొర్రప్రోలు రేంజి అధికారి

పులి పిల్లల విషయం, ఎన్‌క్లోజరు నిర్మాణ పనుల గురించి నాకు తెలియదు. నేను కొత్తగా వచ్చాను. ఎన్‌క్లోజరు నిర్మాణం పనులకు త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు వింత సమాధానమిచ్చారు. ఆ పులి పిల్లల కోసం ప్రారంభించిన ఎన్‌క్లోజరు నిర్మాణానికి టెండర్లు పిలుస్తారంటా....కాని పులుల సంగతి తెలియదంటా...



లక్ష్యమిదీ....

తిరుపతి జూలో పెరుగుతున్న పులి పిల్లలను ఇక్కడ నల్లమలకు తీసుకొచ్చి అటవీ సంస్కృతిని అలవర్చాల్సి ఉంది. అ అందుకుగాను స్థానిక అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా ఎన్‌క్లోజరును ఏర్పాటు చేసి అందులో పులి పిల్లలను వదలాలి. ఆ ఎన్‌క్లోజరులోనే వాటికి ఆహారంగా జింకలు, దుప్పులు తదితర వన్యప్రాణులను విడిచిపెట్టాలి. వాటిని సొంతంగా వేటాడి ఆహారాన్ని సంపాదించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. అందుకు గానూ జింకల పోషణకు, పులిపిల్లలకు వేర్వేరు చోట్ల ఎన్‌క్లోజర్లను ఏర్పాటు చేసేందుకు పలు ప్రాంతాలను ఎంపిక చేశారు. పులి పిల్లల కోసం దోర్నాల మండలంలోని తెట్టుగూడెంలో రూ.2కోట్లతో టైగర్ ఎన్‌క్లోజరు పనులు చేపట్టాల్సి ఉంది. జింకల కోసం నెక్కంటి రేంజిలో పెద్దపెంట, ఆరపెంట, గంగారంపెంటలో అందుకోసం అయా ఎన్‌క్లోజర్‌లో రూ.2.50లక్షలతో సోలార్ బోరుతో పాటు, పైపులైను సదుపాయం, జింకల అవసరాలు తీర్చేందుకు సహజసిద్ధంగా ఉండే నీటి కుంటలు సైతం ఏర్పాటు చేశారు. జింకలను కూడా వదిలారు. మరోపక్క పులిపిల్లల ఎన్‌క్లోజరు పనులు పూర్తి చేసి అక్కడ వన్యప్రాణులను వదలడం ద్వారా వేటాడటాన్ని అలవాటు చేస్తారు. వేటలో వాటి శక్తి యుక్తుల సామర్థ్యాన్ని గుర్తించి తదనంతరం తగిన చర్యలు చేపడతారు.

కొనసాగుతున్న వైద్యాధికారుల ఆందోళన

13వ రోజుకు చేరిన సమ్మె

ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని డిమాండ్



విజయవాడ దీక్షలో పాల్గొన్న పీహెచ్‌సీల వైద్యాధికారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమ్మె కొనసాగుతోంది. మొత్తం 64 పీహెచ్‌సీలు ఉండగా 138 మంది వైద్యాధికారులు సమ్మెలో పాల్గొన్నారు. శుక్రవారానికి సమ్మె 13వ రోజుకు చేరింది. విజయవాడలో జరుగుతున్న రిలే దీక్షల్లో జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని అనేక పర్యాయాలు ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో సమ్మెబాట పట్టారు. ప్రధానంగా ఇన్ సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించడంతోపాటు టైమ్-బాండ్ ఉద్యోగోన్నతులు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు బేసిక్ పే 30శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద రూ.5వేలు అలవెన్స్ ఇవ్వాలని, నేటివిటి అండ్ అర్బన్ ఎలిజిబిలిటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాను గతంలో మాదిరిగా కొనసాగించేలా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచారు. శుక్రవారం విజయవాడలో జరిగిన దీక్షల్లో ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే రాహుల్ పాల్గొన్నారు.

కిల్కారి సేవలను వినియోగించుకొనేలా చూడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గర్భిణులు, బాలింతలు కిల్కారి సేవలు వినియోగించుకునే విధంగా పాటుపడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు సూచించారు. కిల్కారి కాల్ వచ్చినప్పుడు ప్రతి సమాచారాన్ని పూర్తిగా గర్భిణులు, బాలింతలు వినే విధంగా అవగాహన కల్పించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ సమావేశపు హాలులో శుక్రవారం జరిగిన ఆశా నోడల్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కిల్కారి కాల్ సర్వీసును ప్రవేశపెట్టిందన్నారు. గర్భిణి నాల్గో నెల మొదలుకొని బిడ్డ సంవత్సరం అయ్యే వరకు కిల్కారి కాల్స్ వస్తుంటాయని చెప్పారు. ఆశా నోడల్ ఆఫీసర్లందరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడంతో పాటు ఫోన్ నెంబర్లను కూడా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడశిశువును కాపాడుదాం- సృష్టిని రక్షిద్దాం అనే నినాదంతో గర్భస్థ పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కమలశ్రీ, ఆరోగ్య విద్య విస్తరణాదికారి దాసరి శ్రీనివాసులు, డీసీఎం రాజేశ్వరి, కిల్కారి రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నాగులుప్పలపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):తిమ్మసముద్రం సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై ఎస్‌ఐ రజియాసుల్తానా తన సిబ్బందితో దాడిచేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.10,110 నగదు, 6 ద్విచక్రవాహనాలు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బారావు, సిబ్బంది హరికృష్ణ, నారాయణ పాల్గొన్నారు. అలాగే గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00



లబ్ధిదారుకి చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సీఎంకు ఆనందం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి
- 45 మందికి రూ.30,14,666 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

టంగుటూరు (కొండపి), అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సీఎం చంద్రబాబుకు ఆనందమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామి శుక్రవారం మధ్యాహ్నం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మంది అనారోగ్య బాధితులకు 30,14,666 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వ వైద్యశాలల్లో అత్యుత్తమ, ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి ప్రభుత్వం తెస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు డిజిటలైజేషన్ చేసి సంజీవని పథకం ద్వారా పేదలకు మెరుగైన సేవలు ప్రభుత్వం అందించనుందన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలు పూర్తి చేసి వైద్య సేవలు అందిచడంతో పాటు, పేదల వైద్య ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 82 దుకాణాలు

లైసెన్సులు లేకుంటే చట్టపరమైన చర్యలు : డీఎస్పీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అంతేకాండా అక్రమనిల్వలపై జిల్లాలో అనేక ప్రాంతాలలో తనిఖీలు చేస్తున్నారు. నివాస ప్రాంతాల మధ్యలో బాణసంచా తయారీ సామగ్రి ఉండడంపై పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఒంగోలు శివారు ప్రాతంలోని కొత్తమామిడిపాలెం, కొప్పోలు ఫ్లైఓవర్ వద్ద ఉన్న బాణసంచా నిల్వకేంద్రం, దశరాజుపల్లె ప్రాంతాలలో బాణసంచా విక్రయ కేంద్రాలలో ఉన్న నిల్వలను పోలీసులు పరిశీలించారు. అలాగే మద్దిపాడు మండలం సీతారామపురంలో మూసివేసిన బాణసంచా తయారీ కేంద్రాన్ని పోలీసులు పరిశీలించారు.

ఒంగోలుసబ్ డివిజన్‌లో...

ఒంగోలు సబ్ డివిజన్‌లో 82 బాణసంచా దుకాణాలకు తాత్కాలిక విక్రయాల కోసం అనుమతులు ఇచ్చామని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. నగరంలో 43 దుకాణాలు, సంతనూతలపాడులో 2, మద్దిపాడులో 5, నాగులుప్పలపాడులో 1, టంగుటూరులో 7, చీమకుర్తిలో 17, సింగరాయకొండలో 7 దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే అన్ని పోలీసు స్టేషన్ పరిధిలో మైక్‌ద్వారా ప్రచారం చేయిస్తున్నామని అన్నారు.

అడుసుమల్లి సొసైటీపై విచారణకు ఆదేశం

పర్చూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అడుసుమల్లి సొసైటీ(ఎల్‌ఎస్‌సీఎస్) నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణకు బాపట్ల జిల్లా సహకార సంఘం అధికారి సీహెచ్ శ్యాంసన్ ఆదేశాలు జారీచేశారు. సహకార సంఘ చట్టం 51 ప్రకారం విచారించి, నివేదిక పంపించాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ మొహ్మద్ హుసూనుద్దీన్‌ను ఆదేశించారు. సొసైటీ పరిధిలోని పెట్రోలుబంకు నిధులను నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత ఖాతాలోకి జమచేయడమే కాక సొంత అవసరాలకు వినియోగించుకున్నారని, మరణించిన వారికి రుణాలు ఇచ్చినట్లు చూపిస్తున్నారని ఆరోపణలున్నాయి. పాత బకాయిలు ఎన్‌పీఏగా మారేలా ఉన్నా నిర్లక్ష్యంతో వసూలు చేయలేదని నూతన సొసైటీ ఛైర్మన్ పోపూరి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. సంబంధిత సొసైటీ సీఈవోగా ఉన్న రమాదేవి అనారోగ్యం కారణంగా విధులకు హాజరు కాలేదని, భర్త డి.శ్రీనివాసరావు బాధ్యత నిర్వహించారని స్టేట్‌మెంట్ నివేదికలో ఛైర్మన్ పోపూరి పేర్కొన్నారు.

దేశానికి యువతే వెన్నుముక



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థినులు

కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధికి యువతే వెన్నుముక అని జిల్లా కలెక్టర్ పీ రాజాబాబు చెప్పారు. యువత శక్తి, మేధోసంపత్తి సమాజానికి ఉపయోగపడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ యువత నుంచి నూతన ఆవిష్కరణలు, ఆలోచనల కోసం సమాజం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ నూతన ఆలోచనలు, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా జిల్లాకు సంబంధించిన ఒక యాప్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ రంగాలలో నిపుణులైన వారితో యువత అనుసంధానం కావచ్చన్నారు. స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యువజనోత్సవాల్లో ఏడు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా యువజనోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పలునృత్యాల ద్వారా ఆకట్టుకున్నారు.

ఘనంగా జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ప్రతిభ చాటుతూ ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, ఉపవిద్యాధికారి చంద్రమౌళీశ్వర్, డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాసులు, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబులు సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీ గురించి విద్యార్థులకు వివరించారన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా తమ ప్రతిభ చాటాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో వై నిహారిక(జడ్పీ హైస్కూలు ఆలకూరపాడు), బీ హిమవర్షిత(ఏపీ మోడల్‌స్కూలు, దర్శి), పీ మధులత(జడ్పీ హైస్కూలు కోలచనకోట), జి.నస్సీ(జడ్పీహైస్కూలు, త్రోవగుంట) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి స్థానాలలో నిలిచారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ కే శౌరిబాబు, డాక్టర్ నాగలక్ష్మీలు వ్యవహరించారు. ఈ నెల 18న రాష్ట్రస్థాయి సెమినార్ విజయవాడలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, హెచ్‌ఎం వెంకట్రావు, నాగేశ్వరరావు, కేఎస్ రవికాంత్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

సానుకూలంగా స్పందించిన సీఎం



సీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మారుమూల ప్రాంతమైన గిద్దలూరు నియోజకవర్గానికి మరిన్ని నిధులిచ్చి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆయన శుక్రవారం సచివాలయంలో కలిసి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆయనకు వివరించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అందుకు సానుకూలంగా స్పందించి గిద్దలూరు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని స్పష్టం చేశారు. ప్రధానంగా గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆవశ్యకత గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిరంతరం ట్రాఫిక్ సమస్యలతో పట్టణ నడిబొడ్డులో నిరంతరం వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గేటుకు అవతల వైపు రెండు మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించాలంటే కష్టసాధ్యంగా మారిందని, ఆ సమయంలో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే అశోకొరెడ్డి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ రైల్వేగేటు సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. అలాగే నల్లమల అటవీ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతం మీదుగా వెళ్లే సగిలేరు వాగు వలన వరదలు వచ్చే సమయంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, ఇందుకు రిటైనింగ్ వాల్‌తో పాటు పలు చోట్ల చెక్‌డ్యాంలు ఏర్పాటు చేస్తే భూగర్భజలాలు పెరుగుతాయని సీఎం దృష్టికి తీసుకెళ్ళారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని బేస్తవారపేట నుంచి కోనపల్లె, కొమరోలు నుంచి శింగరపల్లె, ఆకవీడు నుంచి పాపినేనిపల్లి రహదారులను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గానికి ఎక్కువ శాతం సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నింటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ సాధ్యాసాధ్యాలను పరిశీలించి గిద్దలూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు.

అండర్-14, 17 జిల్లా హాకీ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్లు

సంతనూతలపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్-14, అండర్-17 బాలిబాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక జరిగింది. క్రీడాకారుల మధ్య పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారిని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొంటారని అండర్-19 జిల్లా కార్యదర్శులు సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎ.శిరీష తెలిపారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు, పేపరు పంపిణీ విషయంలో సమస్యలు ఉన్నా సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411484

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇప్పుడు మీ ఆత్మీయులకు, ప్రకటనల ద్వారా మరింత చేరువకండి.
వివాహ, షష్టిపూర్తి, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
ఉద్యోగ, వ్యాపార, లీగల్ ప్రకటనలు,
శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి
మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 95053 05888, 97036 18694, 96525 55752, 99854 11483
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11071
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

FLAT FOR SALE

"దీపావళి.. ఆఫర్.. SSS HOMES వారు ఒంగోలు", కర్నూలు రోడ్డు, శ్రీసరస్వతి కాలేజీ ఎదురు రోడ్డులో మాచే నూతనంగా నిర్మించిన అపార్టుమెంట్లో 2BHK ఫ్లాట్స్ (1230 Sft) కలవు. తక్షణం గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. దీపావళి ఆఫర్ కేవలం 30 రోజులు మాత్రమే త్వరపడండి. SSS HOMES సంప్ర॥ Mob: 97039 98899, 75694 76242.
AJO-241136

HOUSE FOR SALE

ఒంగోలు, కర్నూల్ రోడ్, మహాలక్ష్మి కళ్యాణ మండపం ఎదురు రోడ్‌లో శ్రీ కృష్ణనగర్‌లో 20 గదులలో 2019లో నిర్మించిన దక్షిణం ఫేస్ గల 2BHK ఇండిపెండెంట్ హౌస్ అమ్మకమునకు కలదు. SSS Homes, 97039 98899, 75694 76242.
AJO-241138

ADMISSIONS

CLR MBA కాలేజ్‌లో MBA మరియు M.Ed సీట్లు కలవు. 2025 - 2026 సం॥కు అతి తక్కువ ఫీజు Affiliated to AndhraKesari University వెంటనే సంప్రదించండి లాస్ట్ చాన్స్. సెల్ : 9912647869, 7780341115.
AJO-233145

WANTED

ఆదర్శ ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఒంగోలు నందు అనుభవం గల ట్రైనిడ్ ఓటి స్టాఫ్ మరియు ఐసియులో నైట్ డ్యూటీ చేయుటకు సర్టిఫికేట్ కలిగిన స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 9849161123.
AJO-499

అమ్మబడును

ఒంగోలు నగరంలోని ఆటోనగర్ నందు కన్‌స్ట్రక్షన్‌తో పూర్తి గల బిల్డింగ్, ఫ్లాట్ నెం 99, 24 గదుల బిల్డింగ్ అమ్మబడును. (త్రోవగుంట మెయిన్ రోడ్‌లో గల 46 గదుల ఖాళీ స్థలము అమ్మబడును) సంప్ర॥ 8499860666
AJO-268055

PLOT FOR SALE

ఒంగోలు కర్నూలు రోడ్డుకి అతిదగ్గరలో వర్మ గ్రాండ్ హోటల్ ఎదురు రెడ్డెమ్మ కాలనీలో 18 గదుల వెస్ట్ ఫేసింగ్, 25X10 షెడ్డు, 8X8 బాత్రూమ్, ఎలక్ట్రిసిటి, కంప్లీట్ కాంపౌండ్‌వాల్‌తో ఉన్న SRO రిజిస్టర్ ప్లాటు కొనుగోలుకై సంప్రదించండి. సంప్ర॥ సెల్: 9392148268.
AJO-241211

పోలీస్/ SSC-GD / ఆర్మీ

65000 పైగా CRPF, CISF, BSF, ITBP కానిస్టేబుల్ ఉద్యోగాలు. (Oct-25 నోటిఫికేషన్) అ: 10th పాస్, వ:18-28, పోలీస్ 11639 ఉద్యోగాలు. అ: ఇంటర్, వ: 18-30, స్టార్ కోచింగ్ సెంటర్, C.P. కాంప్లెక్స్ వెనుక, నంద్యాల, సెల్: 87908 44959. (Since 1999)
AJL-247823

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి


రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలు

మోటుమాల రోడ్డు అధ్వానం

అడుగుకో నీటి మడుగు ● రాకపోకలకు ప్రజల అవస్థలు

కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామ ప్రజలు రోడ్డు మీదకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఈ గ్రామం నడి మధ్య గుండా పోతున్న ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా మారి రూపం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డులో గుంతలు చిన్నపాటి చెరువులు దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డును కారుమంచి- మోటుమాల రహదారిగా పిలుస్తారు. ఏడాదిక్రితం గ్రామం శివారు వరకే తారురోడ్డును కొత్తగా వేసి గ్రామంలో దాదాపు మూడు కిలోమీటర్ల మేర అలాగే వదిలేశారు. దీంతో ఈ రోడ్డులో అడుగుకో పెద్దగుంత ఏర్పడి, వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో గ్రామస్థుల రాకపోకలు సాగించేదుకు ఇబ్బందులు పడుతున్నారు, పైగా మోకాటి లోతులో రోడ్డుపై నీరు చేరి ఉండటంతో వాహనదారులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల అయ్యాయంటూ అధికారులు చెబుతున్న మాటలు ఏళ్ళ తరబడి ఆచరణకు నోచుకోకపోవటంతో గ్రామస్థులకు ఇబ్బందులు తప్పటం లేదు.

-కొత్తపట్నం(ఆంధ్రజ్యోతి)


బురదమయంగా ఉన్న రోడ్డు

లింగంగుంట సొసైటీ అధ్యక్షుడిగా బాలగంగాధర్


నల్లమోతు బాలగంగాధర్

ఒంగోలు(రూరల్), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం వలేటివారిపాలెం గ్రామానికి చెందిన నల్లమోతు బాల గంగాధర్ లింగంగుంట సొసైటీ బ్యాంక్(సెంట్రల్ ఫార్మర్స్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ) అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సొసైటీ సభ్యులుగా దేబత్తిన వీరభద్రరావు, ఆరికట్ల గోపీకృష్ణ ఉన్నారు. ఈ సొసైటీ పరిధిలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్దిపాడు మండలం లోని పలు గ్రామాలు, ఒంగోలు నియోజకవర్గంలోని పలు గ్రామాలు ఉన్నాయి. ఈ సందర్భంగా తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ కుమార్‌కు సొసైటీ అధ్యక్షుడు బాలగంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు.

పొగాకు వేలం కేంద్రానికి దీపావళి సెలవులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2కు ఈనెల 20,21,22 తేదీల్లో దీపావళి పండగ సందర్భంగా ఉన్నతాధికారులు సెలవులు ప్రకటించారని వేలం నిర్వహణాధికారి జె.తులసి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈనెల 23వ తేదీన యథావిధిగా వేలం కొనసాగుతుందన్నారు. పొగాకు రైతులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

గృహ, పట్టణ వ్యవహారాలపై మాగుంట చర్చ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ సమావేశం శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆ కమిటి చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో జనగణన ప్రమాణాలు, ప్రభుత్వ భూముల కేటాయింపుపై మాగుంట మాట్లాడారు. ఈ సమావేశంలో గృహ పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజేపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

మద్దిపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టీస్ గవాయ్ మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మద్దిపాడులో ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కావూరి విజయ్‌రాజు, రెబ్బవరపు ప్రభాకర్, కొత్త సుమన్, అనపర్తి కోటేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలుకు ఘన నివాళులు


శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు 496వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో శుక్రవారం కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో ముందుగా శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తంజావూరు శ్రీనివాసమూర్తి, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, నరహరి సాంబయ్య, వల్లంశెట్టి హనుమంతరావు, శెట్టి పాపారావు, మేకల నారాయణ, శివ, సుబ్బారావు, యడ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం


కలెక్టర్ రాజాబాబును సన్మానిస్తున్న ఎంపీడీవోల అసోసియేషన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాజాబాబును ఎంపీడీవోల అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామాంజనేయులు, పి.సుజాతల ఆధ్వర్యంలో కలెక్టర్ రాజాబాబును శాలువతో సన్మానించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవిని కలిసి తమ సమస్యలను వివరించారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ


నినాదాలు చేస్తున్న నాయకులు

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం అసోసియేషన్ ఆలిండియా జనరల్ అధ్యక్షుడు ఎ.వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. అలాగే అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడుతున్నట్లు చెప్పారు. రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ రేషియోను పాటిస్తూ డివిజన్ అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో దాశరథి కృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌కుమార్, బీవీ.నాయక్ పాల్గొన్నారు.

గృహాలు, ఖాళీ స్థలాలను సర్వే చేయాలి

ఒంగోలు(రూరల్), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ఎన్టీఆర్ కాలనీ, ఇందిరకాలనీ, రాజీవ్‌గృహకల్పకాలనీ, పులివెంకటరెడ్డికాలనీల్లో జరుగుతున్న గృహాలు, ఖాళీ స్థలాల సర్వేను అర్బన్ తహసీల్దార్ పి.మధుసూదనరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లోని నివేశ స్థలాలు, గృహ యాజమానుల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి

● ఎంపీపీ అరుణ

మద్దిపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీపీ వాకా అరుణ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీలకు వీధిదీపాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం జీవో తెచ్చిందని, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు వాకా కోటిరెడ్డి, దుర్గాభవాని, సర్పంచ్‌లు కాకర్ల విజయ్‌కుమార్, సీతారాంపురం మండవ శివానందరావు, చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, బెజవాడ శ్రీరామమూర్తి, బొమ్మల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యక్రమాలపై సమీక్ష

కొండపి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): కొండపి ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, రికార్డుల నమోదు తదితర విషయాలపై పీడీ సువర్ణ శుక్రవారం కొండపిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలకు గర్భిణులు, బాలింతల, చిన్నారుల ఆరోగ్య తనిఖీలు, వారికి సలహాలు ఇవ్వాలన్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అంశాలను అందించాలని సూచించారు. సమావేశంలో కొండపి ప్రాజెక్ట్ సీడీపీవో బి. సుశీలాదేవి, సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు.

118 మందికి ఉద్యోగాలు


ఉద్యోగావకాశాలు దక్కించుకున్న అభ్యర్థులు

సంతనూతలపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండ్లూరు డొంకవద్ద నున్న మహిళా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 118మంది నిరుద్యోగులు ఉద్యోగఅవకాశాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ మాట్లాడుతూ జాబ్‌మేళాకు 252 మంది హాజరుకాగా 118మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ఏడీఎస్‌డీఈ శ్రీను చేతులమీదుగా నియామకపత్రాలను అందజేశారు. జాబ్‌మేళాలో 10 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసచారి, ఎన్‌టీఈ కోఆర్డినేటర్స్ బాషా, అనూష, అబ్దుల్‌రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీనివాసరావు



మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జీఎం శ్రీనివాసరావు

ఒంగోలు నగరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జన శిక్షణ సంస్థ ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ పొందిన మహిళలు ఆయా రంగాల్లో పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఒంగోలులోని జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశ్రమల ఏర్పాటుకు తగిన సహకారం అందిస్తామని, ప్రభుత్వం ఇందుకోసం సబ్సిడీ రుణాలు కూడా అందజేస్తుందని ఆయన చెప్పారు. సూక్ష్మ, మధ్యతరహా, భారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహకాలు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం ద్వారా ప్రభుత్వం పరిశ్రమలు, ఇతర యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందజేస్తుందన్నారు. శ్రీశివసాయి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా జనశిక్షణ సంస్థ వివిధ రంగాల్లో మహిళలకు శిక్షణ ఇస్తూ వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతుందన్నారు. సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు తాము శిక్షణ పొందిన రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ శ్యామ్‌సునీల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో పీవో హరిక్రిష్ణ, శివకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

23లోపు లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలి

● చీమకుర్తి కమిషనర్ రామకృష్ణయ్య


మాట్లాడుతున్న కమిషనర్ రామకృష్ణయ్య

చీమకుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లేఅవుట్లను ఈనెల 23వ తేదీలోపు క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌లో భాగంగా ప్రభుత్వం కల్పించిన సువర్ణావకాశాన్ని ప్లాట్ల యజమానులు గడువులోపు ఉపయోగించుకోవాలని తెలిపారు. చీమకుర్తి మున్సిపల్ పరిధిలో 52 అనధికార లేఅవుట్లు ఉండగా ఇప్పటివరకు 30 క్రమబద్ధీకరించుకున్నారని, మిగతావి కూడా రెగ్యులర్ చేసుకుని భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా చేసుకోవచ్చని ఓనర్లకు సూచించారు. 30-6-2025కు ముందు ప్లాట్‌గా రిజిస్టర్ అయిన అన్ని ప్లాట్లు, లేఅవుట్లును ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు 10శాతం ఓపెన్ స్పేస్ లేదా 14శాతం ఓపెన్‌స్పేస్ చార్జీలతో 50శాతం ఫీజును పీనలైజేషన్ చార్జీలతో సహ చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. అదేవిధంగా 4వేల చదరపుమీటర్లలోపు విస్తీర్ణం గల లేఅవుట్లలో భాగంగాని సొంతస్థలం కలిగినవారు కూడా తగు డాక్యుమెంట్లను సమర్పించి ఎల్ఆర్ఎస్ అనుమతులు కోసం ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో నేరుగా కాని ఎల్‌టీపీ ఇంజనీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గడువులోపు క్రమబద్ధీకరించుకోని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కార్యాలయం లేదా సంబంధిత వార్డు సచివాలయాల్లో సంప్రదించవచ్చని కమిషనర్ తెలిపారు.

ఒంగోలులో హద్దురాళ్ల తొలగింపు

ఒంగోలు కార్పొరేషన్: నగర పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్‌లలో శుక్రవారం కార్పొరేషన్ అధికారులు హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనధికార లే అవుట్‌లు, ప్లాట్లు రెగ్యులైజేషన్ కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈనెల 23వ తేదీ లోపు తమ లేఅవుట్‌లను రెగ్యులైజేషన్ చేయించుకోని వాటిపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు పొందాలి

● ఎస్ఐ రజియాసుల్తానా


మాట్లాడుతున్న ఎస్ఐ రజియాసుల్తానా

నాగులుప్పలపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ రజియాసుల్తానా సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాత్కాలిక బాణసంచా విక్రయాలు చేసేవారు కూడా స్థానిక పోలీసు, ఒంగోలు అగ్నిమాపక అధికారి వద్ద నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలని, తాత్కాలికంగా అనుమతులను ఆర్డీవో కార్యాలయంలో పొందాలని తెలిపారు. విక్రయాలు జరిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

మద్దిపాడు: లైసెన్స్ లేకుండా దీపావళి మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సైదులు తెలిపారు. శుక్రవారం మద్దిపాడులోని మందుగుండు సామగ్రి తయారుచేసే కర్మాగారాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అక్రమంగా విక్రయిస్తే చర్యలు

సంతనూతలపాడు: బాణసంచా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం సంతనూతలపాడులో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీపావళి మతాబులు అమ్మే విక్రయదారులు తప్పనిసరిగా ఫైర్‌స్టేషన్, పోలీస్టేషన్ నుంచి ఎన్‌వోసీ పొందాలన్నారు.

పొన్నలూరులో వర్షం

పొన్నలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు 8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. అలాగే పలు వాగుల నుంచి వరద నీరు నీరు ప్రవహించింది.



SRINIVASA EDUCATIONAL SOCIETY'S
PACE INSTITUTE OF TECHNOLOGY & SCIENCES
(AUTONOMOUS)
Approved by AICTE and Govt.of Andhra Pradesh, Accredited by NAAC(A Grade), Recognized under 2(f) & 12(B) of UGC Permanently Affiliated to JNTUK, Kakinada. A.P., | ISO 9001:2015, ISO 14001:2015 and ISO 50001:2018 Certified Institution
NH-16, Near Valluramma Temple, ONGOLE - 523 272, A.P., INDIA, Ph.: 08592 278315, 9581456310 | www.pace.ac.in

I-B.TECH ADMISSIONS NOTIFICATION 2025-26
UNDER CATEGORY "B" MANAGEMENT QUOTA

Applications are invited from eligible candidates for admission into the following I-B.Tech., courses under Category-B (Non-NRI and Unfilled NRI) management quota seats for the academic year **2025-26.**

COURSE	CIVIL	EEE	MECH	ECE	CSE	AI&DS	AI&ML	CSE (IoT & CSBT)	EE (VLSID &T)
Intake	60	60	60	180	480	180	180	120	60
Category 'B' Seats	18	18	18	54	144	54	54	36	18

Application can be obtained either from the college office or can be downloaded from our website: **www.pace.ac.in** Filled in application along with copies of relevant certificates, registration fee Rs. 1000/- for EAPCET qualified and 1200/- for EAPCET not qualified shall be submitted in the college on any working day between 9.00 a.m. to 5.00 p.m on or before **23.10.2025.** Merit/Selected list will be displayed on **25.10.2025.** The eligibility and admissions will be as per the Guidelines of the Andhra Pradesh State Council of Higher Education.

☎ 9581456310 COUNSELLING CODE - PACE PRINCIPAL



ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం


కొత్తపట్నం ఎస్సీ హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న నాయకులు

కొత్తపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కొత్తపట్నంలోని సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకుడు ఎస్.స్వామిరెడ్డి మాట్లాడుతూ వసతిగృహం పాఠశాలకు దూరంగా ఉందని, స్కూలుకు వెళ్ళే మార్గం వర్షపునీటితో నిండి ఉండటం వల్ల వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే వసతిగృహంలో కూడా నీరు నిలబడుతుందని, చుట్టూ చిల్లచెట్లు దట్టంగా పెరిగి ఉండటం వల్ల పాములు వచ్చే అవకాశం ఉందని, దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. విద్యార్థులు తాగునీటికి కూడా ఇబ్బందిపడుతున్నారని, పంచాయతీ పైపులైను ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.రమణయ్య, కె.శ్రీను, పి.శ్రీనివాసులు, పి.చలపతి పాల్గొన్నారు.

మెనూ చార్జీలను పెంచాలి

మద్దిపాడు: హాస్టల్ విద్యార్థులకు మెనూ చార్జీలను పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, రఘురాం డిమాండ్ చేశారు. మద్దిపాడులోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను వారు శుక్రవారం సందర్శించారు. హాస్టల్‌లోని అన్ని గదులను పరిశీలించారు. విద్యార్థులు దోమలతో ఇబ్బందులు పడుతున్నారని, సెలవురోజుల్లో ఆడుకునేందుకు పరికరాలు లేవన్నారు. వర్షం వస్తే హాస్టల్ ప్రాంగణంలో నీరు నిలబడుతుందని, వెంటనే హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు కనపర్తి సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, కాకుమాను సుబ్బారావు, ఉబ్బా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బీసీ సెల్‌లో చీమకుర్తి నాయకులు

చీమకుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రకటించిన జిల్లా కార్యవర్గంలో చీమకుర్తికి చెందిన ఇరువురు నాయకులకు చోటుదక్కింది. బీసీ సెల్ ప్రధానకార్యదర్శిగా తెల్లమేకల గాంధీ, కార్యదర్శిగా సోమా శేషాద్రిలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మలకు ధన్యవాదాలు తెలిపారు.


మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

● ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం గుమ్మళంపాడు గ్రామంలో నర్సరీ నుంచి తెప్పించిన మొక్కలను పలు కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మూడవ శనివారం ప్రతీ పంచాయతీ పరిధి లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం చెత్తసేకరణను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొడ్డపాటి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

పామూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరాయ కొండ జాతీయ రహ దారి 167బీ పరిధిలో బైపాస్‌లు నిర్మించిన చోట గ్రామాలను అనుసంధానిస్తూ ఉన్న రోడ్ల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. మండలంలోని దూబగుంట బైపాస్ నుంచి సీఎస్‌పురం రోడ్డు, కందుకూరు రోడ్డు మీదుగా నుచ్చుపొద, బైపాస్ వరకు 7 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.7కోట్లు, సీఎస్‌పురం మండలం ఎ.కొత్తపల్లి, అయ్యలూరివారిపల్లి, డీజీపేట, సీఎస్‌పురం పరిధిలో 11 కి.మీ మేర సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.11కోట్లు మంజూరయ్యాయి. పామూరులోని మయూరి లాడ్జి నుంచి నెల్లూరు రోడ్డు బైపాస్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.40 కోట్లు మంజూరుచేసినట్టు అధికారులు తెలిపారు.



అవీ..ఇవీ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివనాయక్

కంభం వైద్యశాలలో సీపీఆర్‌పై అవగాహన

కంభం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రభుత్వ వైద్యశాలలో సీపీఆర్‌పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు వైద్యులు డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషా ప్రియదర్శిని మాట్లాడుతూ ఎవరికైనా గుండెపోటు వచ్చి పడిపోతే వైద్యశాలకు చేర్చేలోగా సీఆర్‌పీ విధానంతో చాతిపై చేతి వేళ్లతో చేయాల్సిన ప్రక్రియను గురించి వివరించారు. డాక్టర్ శివ నాయక్ అత్యవసర పరిస్థితులలో చేయవలసిన సీపీఆర్ విధానాన్ని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ వైద్యులు, వైద్యశాల పేషెంట్లు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాపు సంఘం నాయకులు

కంభంలో శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి

కంభం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి సందర్భంగా శుక్రవారం కంభం పట్టణం కందులాపురం సెంటర్లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల ఉద్యోగ, ఉపాధ్యాయ, బలిజ సేవా సంఘం అధ్యక్షుడు సూరె ప్రసాద్, పగిటి రమణలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకులు లంక నరసింహారావు, పార్శ శంకర్, సోమిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో..

గిద్దలూరు టౌన్ : కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల 496వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కాపు సంఘం ఆవరణలో గల శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, కాపు సంఘం అధ్యక్షుడు యగటీల వెంకటసుబ్బయ్య, నాయకులు ఆర్‌డీ రామకృష్ణ, పసుపులేటి వెంకటేశ్వర్లు, యగటీల పాండు పాల్గొన్నారు.



కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. జేఎల్‌ఎమ్ గ్రేడ్-2లకు ఏపీ ఎస్ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేయాలని, విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి, నాయకులు రూబెన్, సుబ్బరాయుడు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సీజేఐపై దాడి అమానుషం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసనగా ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దళిత ఆత్మ గౌరవ నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎంఆర్‌పీఎస్ గిద్దలూరు ఇన్‌చార్జి కొండెపోగు దేవప్రబాకర్ మాట్లాడుతూ ఈ దాడి దళిత, పీడిత వర్గాల ప్రజలను మనోవేదనకు గురి చేసిందని, దీనిని దళిత నాయకులందరూ ఖండించారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్మునూరి వెంకటేశ్వర్లు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పందిటి రజనీకుమార్, గుర్రం డానియేలు, చెరకుపల్లి లక్ష్మయ్య, బొమ్ము ఏర్సా, చందాల కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బాల్య వివాహాలు అనర్ధదాయకం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అనర్ధదాయకం అని పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి ఈ శ్రీకాంత్ అన్నారు. స్థానిక డ్రైవర్స్ కాలనీలో బాల్య వివాహాలను నిరోధించాలని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. చిన్నవయసులో కిశోర బాలికలకు వివాహాలు జరపటంతో ఎన్నో ఇబ్బందులు ఉంటాయని అన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.కాశయ్య, వసుమతి, బి.అరుణకుమారి, అనసూయ, సత్యనారాయణ, సంధ్యారాణి, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ వేగవంతం

మండలంలో 35వేలకు గాను 17వేల మందికి పూర్తి

10 వేలకు పైగా వలస వెళ్లిన శ్రామికులు



గ్రామాల్లో కూలీలకు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకంలో నకిలీ జాబ్ కార్డులను (శ్రామికులను) ఏరిపారేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందుకుగాను శ్రామికులకు ఈకేవైసీని తప్పనిసరి చేయాలని ఆదేశించింది. దీనితో పనులకు వచ్చే శ్రామికులకు ఈకేవైసి చేసే పనిలో సిబ్బంది నిమగ్నమైయ్యారు. ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా ఉన్న 19 గ్రామ పంచాయతీల పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఈకేవైసీ పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 19 పంచాయతీల్లో మొత్తం సుమారు 19వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ఆ జాబ్ కార్డులకు సుమారు 37వేల మందికిపైగా కూలీలు ఉన్నారు. నేటి వరకు సుమారు 17వేల మందికి ఈకేవైసీని సిబ్బంది పూర్తి చేసినట్లు ఏపీవో శైలజ శుక్రవారం తెలిపారు.

వలస వెళ్లిన వారి పరిస్థితి ఏమిటి?

వెనుకబడిన ప్రాంతమైన ఎర్రగొండపాలెం మండలంలోని పలు గ్రామాలలోకార్మికులు ఇతర ప్రాంతాలకు (తెలంగాణా, కర్ణాటక, బెంగళూరు) పనుల నిమిత్తం సుమారు 10వేలకు పైగా వలసలకు వెళ్లినట్లు తెలుస్తోంది. మరి వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నగా మారింది. వీరంతా ఈకేవైసీ చేసుకుంటేనే నవంబరు 1వ తేదీ నుంచి పనులకు గాని ఉద్యాన పథకాలకు అర్హులని అధికారులు చెబుతున్నారు. మరి వీరంతా ఈ పదిరోజుల్లో వచ్చి ఈకేవైసీ చేయించుకుంటారా లేదా అనేది చూడాల్సి ఉంది.

తప్పనిసరని చెబుతున్నాం



మండలంలోని చాల గ్రామాలలో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఆయా గ్రామాలలోని ఫిల్డ్ అసిస్టెంట్ల ద్వారా వారికి సమాచారం ఇవ్వడంతో పాటు ఈకేవైసీ తప్పనిసరి అని చెబుతున్నాం. దగ్గరలో ఉన్నవారు, ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉన్న వారు వచ్చి ఈకేవైసీ చేయించుకుంటున్నారు. మిగిలిన వారికి కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తు న్నాం.

- ఏపీవో శైలజ

మురుగునీటి శుద్ధి ప్లాంటుకు స్థలం పరిశీలన

గిద్దలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపాలిటీకి మురుగునీటి శుద్ధి ప్లాంటు (ఎస్‌టీపీ) మంజూరైంది. ఈ ప్లాంటు ద్వారా మురికినీటిలోని కలుషితాలను తొలగిస్తారు. శుద్ధి చేసిన నీటిని తోటలకు, ఇతరత్రా అవసరాలకు వినియోగించడం వలన మంచినీటి వాడకం తగ్గుతుంది. ఈ ప్లాంటు ఏర్పాటు కోసం మండలంలోని కొంగళవీడు గ్రామపరిధిలో 1.36 ఎకరాల స్థలాన్ని స్థానిక అధికారులు ఎంపిక చేయగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఈ స్థలాన్ని పరిశీలించారు. తగిన సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మండల సర్వేయర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



మురుగు నీటి శుద్ధి ప్లాంటు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

అనుమలవీడులో విద్యుత్ కేంద్ర నిర్మాణ స్థలం పరిశీలన

రాచర్ల : మండలంలోని అనుములపల్లి విద్యుత్ కేంద్ర నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జేసీ గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. 33/11కెవి విద్యుత్ కేంద్రం నిర్మాణానికి భూమి కావాలని విద్యుత్ శాఖ వారు కోరగా, వారికి భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం రైతుల నుంచి 9.05ఎకరాల స్థలాన్ని సేకరించి వారికి ఇచ్చింది. దీంతో అక్కడ విద్యుత్ కేంద్రం నిర్మించారు. అందుకు సంబంధించి విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన భూమి, వాటి వివరాలు స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి సేకరించిన సమాచారాన్ని, భూ బదలాయింపు వివరాలను రికార్డుల్లో పరిశీలించారు. జేసీ వెంట మండల తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ ఏ శ్రీనివాసరావు, అనుములపల్లి వీఆర్వో ఈర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

వేడుకగా అంకాలమ్మ, గంగమ్మ విగ్రహాల ప్రతిష్ఠ



అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

కొనకనమిట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినారికట్ల గ్రామంలో అంకాలమ్మ, గంగమ్మ, పోతురాజు, గమిటిశిల విగ్రహాలకు శుక్రవారం ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఇటీవల కాలంలో పోలేరమ్మ గుడి ప్రాంగణంలో ఉన్న దేవతలు అయిన అంకాలమ్మ, గంగమ్మ, పోతురాజు విగ్రహాలు పాడుపడి పోయాయి. నూతనంగా పోలేరమ్మ గుడి ప్రహరీ నిర్మాణం చేసి ఒకే ప్రాంగణంలో నూతన అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠను గ్రామ పెద్దలు చేశారు. ప్రతిష్ఠాచార్యులు, వేదపండితులు హోమాలు, దేవతా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తమ ఇష్ట దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అంకాలమ్మ, గంగమ్మ, పోతురాజు, గమిటిశిలను ప్రతిష్ఠించారు. కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

అనంతరం ప్రతిష్ఠకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. 19వ తేదీ ఆదివారం పోలేరమ్మకు కుంకుమ బండ్లు కట్టనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు

పుల్లలచెరువు,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిత్యం పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం స్థానిక పుల్లలచెరువు జడ్పీ పాఠశాలలో గ్లోబల్ హ్యాండ్ వాష్ంగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా ట్రస్ట్, యూనిసెఫ్ , ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవహన కల్పించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టరు రంగారావు, ప్రోగామ్ ఆఫీసరు మేడికొండ శ్రీనివాసరావు,గ్రామ సర్పంచి ఓబులు,టీడీపీ నాయకులు ప్రసాద్, స్కూల్ చైర్మన్ కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బాడ్మింటన్‌లో తురిమెళ్ల విద్యార్థి సత్తా



హరిచరణ్

కంభం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -19 క్రీడల్లో భాగంగా సింగరాయకొండలో శుక్రవారం జరిగిన షటిల్ బ్యాడ్మింటన్‌లో కంభం మండలం తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సీహెచ్ హరిచరణ్ జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి టీమ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సోని ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల క్యారమ్స్, పరుగుపందెం, డిస్క్‌త్రోలో కూడా తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణించారని తెలిపారు. కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ లేనప్పటికీ విద్యార్థులను అధ్యాపకులు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

వైభవంగా హజరత్ దస్తగిరిస్వామి ఉరుసు



ఉరుసులో పాల్గొని ప్రార్థనలు చేస్తున్న టీడీపీ నాయకుడు కృష్ణకిశోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయనపల్లె గ్రామంలోని హజరత్ దస్తగిరి స్వామి 4వ ఉరుసు మహోత్సవం వైభవంగా జరుగుతున్నది. శుక్రవారం టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి స్వామి వారి దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, మునులపాటి బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శనగ విత్తనాల పంపిణీ

తర్లుపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్న, చిన్నకారు రైతులకు 25శాతం సబ్సిడీతో శనివారం నుంచి శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారిణి జోత్స్నదేవిక అన్నారు. 5 ఎకరాలకు ఒక్కొక్క రైతుకు ఎకరానికి 40 కేజీల చొప్పున 200 కేజీలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శనగలు క్వింటా రూ.7,800కు గాను సబ్సిడీ రూ.1,950 పోతుందన్నారు. రైతులకు క్వింటాకు రూ.5,850 చెల్లించి తర్లుపాడు, సీతానాగులవరం రైతు సేవా కేంద్రాలలలో శనగ విత్తనాలు తీసుకోవాలని ఆమె తెలిపారు.

రంగనాయకస్వామి భూముల కౌలు వేలం వాయిదా



వేలంకు హాజరైన అధికారులు

రాచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి భూముల కౌలుకు శుక్రవారం జరగవలసిన వేలం సభ్యులు ఎవరూ హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు రంగస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య తెలిపారు. తదుపరి వేలం ఎప్పుడు నిర్వహించేది ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

న్యాయవ్యవస్థను అందరూ గౌరవించాలి

కొనకనమిట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : న్యాయవ్యవస్థను ప్రతి భారతీయుడు గౌరవించాలని ఎంఆర్‌పీఎస్ కొనకనమిట్ల మండల అధ్యక్షుడు చింతగుంట జయకుమార్ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్యని, దాడిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి కొనకనమిట్ల తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన చేపట్టారు. దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అరుణకు వినతిపత్రం అందజేశారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

సీఎం సహాయ నిధి పేదలకు వరం

- టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు
- 33 మందికి రూ. 32.58 లక్షల చెక్కులు అందజేత

ఎర్రగొండపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సాయం మంజూరు అవుతుందని అన్నారు. 33 మంది ఆపన్నులకు రూ. 32,58,671 లక్షల సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో టీడీపీ ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు వేగినాటి శ్రీను, తెలుగుయువత అధ్యక్షుడు దొడ్డా శేషాద్రి, మండలపార్టీ అధ్యక్షుడు పి. ప్రసాదు, మేకల వళరాజు, టీడీపీ నాయకులు మేడికొండ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నకిలీ మద్యం విక్రయాలను నిరోధించేందుకే సురక్ష యాప్

- ఎక్సైజ్ సీఐ జయరావ్



యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి చూస్తున్న ఎక్సైజ్ సీఐ జయరావు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి విక్రయాలు జరపాల్సిందిగా అన్ని మద్యంషాపుల లైసెన్సుదారులకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయరావ్ సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని అన్ని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌ను, సీసా ఉత్పత్తి వివరాలు, ఎంఆర్‌పీ , చెల్లుబాటు వివరాలను తెలుసుకోవచ్చన్నారు. తద్వారా నకిలీ మద్యం విక్రయాలను నిరోధించడం, వినియోగదారుల రక్షణకు సహకారం లభిస్తుందన్నారు. వినియోగదారులు తమకు విక్రయించిన మద్యం సీసాల వివరాలను తెలుసుకోవడానికి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకోవాలని సూచించారు. మద్యం విక్రయాలు అన్ని యాప్‌లో స్కాన్ చేసి అమ్మకాలు నిర్వహించేలా అన్ని మద్యం దుకాణాలలో ఏర్పాట్లు చేసినట్లు, వాటి అమలుపై పర్యవేక్షణ కోసం ఎక్సైజ్ సిబ్బందిని నియమించినట్లు సీఐ తెలిపారు.

కంభంలో మద్యం షాపుల తనిఖీ

కంభం : కంభం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాలలోని 11 మద్యం షాపులను ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాప్ యజమానితో మాట్లాడుతూ ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మాత్రమే ప్రతి మద్యం బాటిల్‌ను అమ్మాలని సూచించారు. అలాగే యాప్ ద్వారా స్కాన్ చేసిన తర్వాత మాత్రమే ప్రభుత్వం మద్యం అని గుర్తింపబడుతుందన్నారు. తనిఖీలలో బీర్ బాటిల్స్‌పై ప్రెస్‌పై ఫీల్ కోడ్ లేకపోవడం వలన అవి స్కాన్ చేయబడలేదని గమనించారు. భవిష్యత్తులో బీర్ బాటిల్స్‌పై కూడా హీల్ కూడా అమలు చేయబడుతుందన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే ఆ షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కొండారెడ్డి హెచ్చరించారు. అంతకు ముందు ఆయన అన్ని మద్యం దుకాణాలలో ఉన్న స్టాకును, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

తర్లుపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అన్నారు. తర్లుపాడు బస్టాండ్ సెంటర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రరూపం దాల్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, నాయకులు గాయం శ్రీనివాసులరెడ్డి, రామసుబ్బారెడ్డి, యక్కంటి రామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రంగారెడ్డి, పలువురు సర్పంచులు, శ్రేణులు పాల్గొన్నారు.

'మానవతా సంస్థ సేవలు విస్తరిస్తాం'

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు మరింత విస్తరిస్తామని ఆ సంస్థ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి చెప్పారు. స్థానిక కొండారెడ్డి కాలనీలో కె.వెంగయ్యకు ఆక్సిజన్ మిషన్ శుక్రవారం అందించారు.



ప్రహసనంగా మారిన బీఈడీ విద్య

» చూచిరాతల పరీక్షలు
» తరగతులకు హాజరుకాని వైనం

దర్శి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బోధన చేసే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి ఎంపిక య్యే బీఈడీ విద్య ప్రహసనంగా మారింది. బీఈడీ చదివే విద్యార్థులు కళాశాలలకు వచ్చే పనిలేకుండా బోధనా క్లాసులకు మాజరయ్యే అవసరం లేకుండానే విద్యా సంవత్సరం పూర్తవుతుంది. కేవలం బీఈడీ విద్యార్థులు పరీక్షలకు మాత్రమే హాజరవుతున్నారు.

ఒకటో తరగతి విద్యార్థులకు కూడా బోధన లేకుండా పరీక్షలు రాసే అవకాశం ఉండదు. బీఈడీ కోర్సులు చదివే విద్యార్థులకు మాత్రమే దర్శిలో అలాంటి అవకాశాలు లభిస్తున్నాయి. దర్శి పట్టణంలో 14 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలల్లో 110 సీట్లు ఉన్నాయి. కళాశాలల యజమానులు 90శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో భర్తీ చేసుకుంటున్నారు. ఒరిస్సా, బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించి ఇక్కడ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. కొంతమంది దళారులు పాస్ గ్యారెంటీ పేరుతో ఇతర రాష్ట్రాల విద్యార్థులను నమ్మపలికి ఇక్కడ చేర్పిస్తున్నారు. ఆ దళారులు ఒక్కో విద్యార్థి నుంచి సుమారు లక్షా యాభై వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. కళాశాలలకు రూ.లక్ష చొప్పున చెల్లించి మిగిలిన సొమ్ముతో దళారులు లబ్ధిపొందుతున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు కేవలం సెమిస్టర్ పరీక్షలకు, ఫైనల్ పరీక్షలకు మాత్రమే హాజరవుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈతంతు కొనసాగుతున్నప్పటికీ యూనివర్శిటీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ముడుపులు తీసుకొని సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో నాగార్జున యూనివర్శిటీ పరిధిలో ఈకళాశాలలు ఉండేవి. ప్రస్తుతం ఒంగోలులోని ఆంధ్ర కేసరి యూనివర్శిటీలోకి ఈ కళాశాలలు వచ్చాయి. యూనివర్శిటీలు మారినా కళాశాలల పనితీరు మాత్రం మారలేదు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ అధికారులు కూడా బీఈడీ అక్రమ విద్యావిధానానికి సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం కొనసాగుతున్న కళాశాలల్లో కొన్నింటికి సొంత భవనాలు లేవు. కేవలం కాగితాల మీదనే కళాశాలలు నడుస్తున్నాయి. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులకు లాడ్జీలు, హోటల్స్ బుక్‌చేసి అక్కడ బస ఏర్పాటు చేస్తున్నారు. నేరుగా పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాసి తమ సొంత రాష్ట్రాలకు వెళ్తున్నారు. ఆతర్వాత బీఈడీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. బీఈడీ విద్యావిధానాన్ని చూసి విద్యావేత్తలు, ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

మాస్‌కాపీయింగ్

ప్రస్తుతం బీఈడీ సెమిస్టర్ పరీక్షలు జరిగిన తీరు ప్రహసనంగా మారింది. గత ఐదు రోజులు జిల్లావ్యాప్తంగా సెమిస్టర్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. పొదిలిలో కాపీయింగ్ జరుగుతున్న తీరును ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ఆంధ్రకేసరి యూనివర్శిటీ అధికారులు కదిలి తనిఖీలు చేశారు. ఈక్రమంలో కాపీయింగ్ చేస్తూ నల్గురు విద్యార్థులు పట్టుబడ్డారు గిద్దలూరులో మరో ఇద్దరు పట్టుబడ్డారు. పరీక్షల సమయంలో పరిశీలకులుగా వస్తున్న యూనివర్శిటీ అధికారులు ఇంత జరుగుతున్నా అన్నీ సక్రమంగా జరుగుతున్నట్లు సంతకాలు పెట్టి తమ వాటా మామూళ్లు తీసుకొని వెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. యూనివర్శిటీ అధికారులు పకడ్బందీగా వ్యవహరిస్తే ఈఅక్రమ విద్యావిధానానికి అడ్డుకట్ట పడేది. అన్నిస్థాయిల్లో వ్యక్తులు కళాశాలలకు సహకరిస్తుండటంతో యథేచ్ఛగా ఈతంతు కొనసాగుతోంది. పరీక్షల్లో కాపీయింగ్‌కు అడ్డుకట్ట వేసి బీఈడీ విద్యను నిబంధనల ప్రకారం కొనసాగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం


అర్జున్ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కోడుమూరు టీడీపీ కార్యకర్త కుటుం బానికి శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. గురువారం జరిగిన ప్రధాని నరేంద్రమోదీ పర్యటన కోసం కోడు మూరు నియోజకవర్గ అబ్జర్వర్‌లుగా మంత్రి గొట్టిపా టి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వ్యవహరించారు.

ఈ నేపథ్యంలో కోడుమూరు మండలం మునగాలపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త అర్జున్ ప్రధాని నరేంద్రమోదీ సభకు వెళ్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని ఆదు కోవాలని సీఎం సూచించగా.. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరితో కలసి అర్జున్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. అన్నివిధాల అండగా ఉంటామని వారి కుటుబసభ్యులకు భరోసా కల్పించారు.

'రాష్ట్రాభివృద్ధికి పీఎం సంపూర్ణ సహకారం'

దర్శి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదలచేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా డబుల్ ఇంజన్ సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో రూ.13429 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభం, శంకుస్థాపనలు చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు భారీగా వస్తున్నాయన్నారు. విశాఖలో గూగుల్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావటమే ఇందుకు నిదర్శనమన్నారు. భవిష్యత్తులో రాష్ట్రం అనిరంగాల్లో అభివృద్ధిచెంది సూపర్ పవర్‌గా నిలుస్తుందన్నారు.

రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో ప్రజాప్రభుత్వం ప్రజారంజకంగా పాలన సాగిస్తుందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. దీంతో అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టటంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలిపోవటంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వైసీపీ నాయకులు రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను చూసి ఓర్చుకోలేక దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. పీపీపీ విధానం ద్వారా రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే ప్రజాప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో సంతకాల సేకరణ పేరుతో అబద్ధపు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అన్నివిషయాలను గమనిస్తున్నారని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

తాళ్లూరు- శివరాంపురం రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు


ఎక్స్‌కవేటర్‌తో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

తాళ్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-విజయవాడ గ్రీన్‌హైవే నిర్మాణం కోసం అధిక వాహనాల్లో గ్రావెల్‌తో రాకపోకలు సాగిస్తుండటంతో తాళ్లూరు-శివరాంపురం రోడ్డు దెబ్బతింది. దీంతో రోడ్డు నిర్మాణ నిర్వహకులు తాత్కాలికంగా గుంతలను పూడ్చించారు. ఎస్‌ఐ మల్లికార్జునరావు జోక్యంతో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు జరిగాయి. గత కొంతకాలంగా ఈమార్గంలో గుండా గ్రావెల్ తోలకంతో టిప్పర్లు అధికంగా కొత్రపాటివారిపాలెం కొండకు తిరుగుతున్నాయి. దీంతో తాళ్లూరు నుంచి శివరాంపురం సమీపానగల సాగర్ కాలువ వరకు రోడ్డు పూర్తిగా(5కిలో మీటర్ల)రోడ్డు గుంతలమయమైంది. కార్లు, ఆటోలు ఈరహదారిపై తిరగలేని విధంగా రోడ్డు దెబ్బతింది. ప్రయాణికుల పడుతున్న కష్టాలను రోడ్డు నిర్మాణ నిర్వహకుల దృష్టికి ఎస్‌ఐ తీసుకెళ్లి తక్షణమే గుంతలు పూడ్చించాలని సూచించారు. దీంతో నిర్వాహకులు రోడ్డులో పడిన పెద్ద పెద్ద గుంతలను చిప్స్ మిక్సర్‌తో పూడ్చి చదును చేశారు.

అధ్వానంగా పారిశుధ్యం


పెద్దన్నపల్లిలో రోడ్డుపై నిలిచిన మురుగు

పీసీపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపల్లి గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. చినుకు రాలితే ప్రధానమార్గంతో పాటు అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. గురువారం కురిసిన కొద్దిపాటి చిరుజల్లులకే గ్రామంలోని ప్రధాన రహదారిలో మట్టి, బురదతో దారుణంగా తయారైంది. వాహనాలే కాకుండా కాలినడకన కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై బురదమట్టి పేరుకు పోవడంతో వాహనచోదకులు, నడిచివెళ్లేవారు జారిపడి గాయాలపాలవుతున్నారు. ఈరోడ్డు గ్రామం నడిమధ్యలో ఉండడంతో దానిపై నిలిచిన మురుగుతో దోమలు పెరిగి వ్యాధులు వ్యాప్తిచెందే ప్రమాదముందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితిపై గతంలో అనేకమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడిన కారు

ముండ్లమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కారు బోల్తా పడటంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని ఉలగల్లు వద్ద వినుకొండ వెళ్ళే ప్రధాన రహదారి పక్కన శుక్రవారం తెల్లవారుజామున కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం జరిగింది. కారులో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. ఆసమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్నవారుచూసి కారు అద్దాలు పగులగొట్టి డ్రైవర్‌ను బయటకు తీశారు. కారు ఢీకొన్న సమయంలో విద్యుత్ లేకపోవటంతో పెద్దప్రమాదం తప్పింది.

ఓటు హక్కు నమోదుకు బీఎల్‌వోలు చర్యలు తీసుకోవాలి

ముండ్లమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకొనే విధంగా బీఎల్‌వోలు దృష్టి సారించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌వోలు తమ పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు అవగాహన కల్పించి ఓటు నమోదు చేసుకొనే విధంగా చూడాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండేవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల్లో కూడా సౌకర్యాలు ఉండేవిధంగా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన డాక్టర్ లలిత్‌సాగర్


రోడ్డుప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్

ముండ్లమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకులను టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్ పరామర్శించారు. గురువారం మధ్యాహ్నం పులిపాడు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో పసుపుగల్లు గ్రామానికి చెందిన కోడిగం సాయికుమార్, చొప్పరపు వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ శుక్రవారం రాత్రి వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులు డాక్టర్ బ్రహ్మేశ్వరరావుతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

పరామర్శించిన వారిలో టీడీపీ నాయకులు బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, గోడాల శివశంకర్‌రెడ్డి, గోడాల సాంబశివారెడ్డి, మారం నాగార్జునరెడ్డి, కోడిగం ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు కృషిచేయాలని ఆపార్టీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ అన్నారు. మండలంలోని పెదగోగులపల్లి, వెంగనగుంట, కె.అగ్రహారం గ్రామ పంచాయతీ కేఎస్ఎస్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ గ్రామ అధ్యక్షులు పునుగుబాటి రవికుమార్, కొండెబోయిన శ్రీరాములు, యడవల్లి చినసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చిల్లచెట్లు తొలగింపు

దొనకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని హిందూ శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్ల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఆఖరి మజిలీకి అవస్థలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, దొనకొండ పంచాయతీ కార్యదర్శి పోట్ల కృష్ణమూర్తి శ్మశానవాటిక ప్రాంతాన్ని పరిశీలించారు. శనివారం ఎక్స్‌కవేటర్ ద్వారా ముళ్ల చెట్లను తొలగిస్తామని వారు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పామూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో పల్నాటి వీర్ల అంకమ్మ తల్లి అమ్మవారి శిలా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కారంపూడి చెన్నకేశవుల దేవస్థాన పీఠాధిపతులు తరుణ్ చెన్నకేశవులు, వేదాల వెంకటచార్యుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, యారవ శ్రీనివాసులు, సర్పంచ్ సిద్దమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ బొమ్మన శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు దుగ్గిరెడ్డి లక్ష్మీ నారాయణరెడ్డి, సోమిశెట్టి వెంకటనారాయణ, డి.జయవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తొలగిన ఇబ్బందులు

పామూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ ప్రాంగణంలో వర్షపు నీరు నిలబడటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య, బూత్ కన్వీనర్ గోళ్ల వీరబాబు ట్రాక్టర్‌లతో మట్టితోలి మెరక పనులు చేపట్టి నీరు నిలబడకుండా చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా వారికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

పామూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల బీసీ కాలనీలో విద్యుత్ తీగలకు చిల్లచెట్లు అలుముకొని ఉండటంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. టీడీపీ గ్రామ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు సొంత నిధులు వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో చిల్లచెట్లను తొలగించారు. చిల్లచెట్లు తొలగింపుతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగిందని వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే, కాలనీలో సొంత నిధులు వెచ్చించి రెండు బోర్లను వేయించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి

పామూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇనిమెర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగాక ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందజేయాలి

పీసీపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందజేయాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదఅలవలపాడు ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులను విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలను సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు.

తాళ్లూరులో పారిశుధ్య కార్యక్రమాలు

తాళ్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామపంచాయతీలో పారిశుధ్య పనుల్లో భాగంగా శుక్రవారం అపరిశుభ్రంగా ఉన్న మినీవాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు. ఇటీవల డీపీవో ఎం.వెంకటేశ్వర్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలను సందర్శించారు. వాటర్ ట్యాంక్‌లు పాచిపట్టి ఉండటంతో తక్షణమే శుభ్రంచేయించి సున్నం పూయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈక్రమంలో ఎంపీడీవో పి.అజిత సూచనలతో సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగంలు గ్రామంలోని వాటర్ ట్యాంక్‌లను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.

వైద్యుల సమ్మెతో అందని సేవలు


దొనకొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

దొనకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లోని పేదప్రజలకు వైద్య సేవలు అందడంలేదు. దొనకొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అసోసియేషన్ నిర్ణయం మేరకు సమస్యల పరిష్కారం నిమిత్తం వారు విధులకు హాజరు కాకుండా సమ్మెబాట పట్టి ఔట్ పేషెంట్(ఓపీ) సేవలను బహిష్కరించారు. వైద్య శిబిరాలకు, 104 సంచార సేవలకు దూరంగా ఉంటున్నారు. మండలంలోని పలుగ్రామాల నుంచి ప్రతిరోజు దాదాపు 70 మంది వరకు రోగులు ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. 20 రోజుల నుంచి డాక్టర్లు విధుల కు హాజరుకాకపోవటంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందటం లేదు. పీహెచ్‌సీలో ప్రస్తుతం చిన్నచిన్న ఆరోగ్య సమస్యలపై వచ్చిన రోగు లకు ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు అరకొరగా వైద్యం అందిస్తున్నారు.

సీపీఆర్ విధానంపై అవగాహన

పామూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గుండెజబ్బుల బారినపడిన వారికి సీపీఆర్ విధానం ద్వారా తక్షణమే ప్రాణాలు కాపాడవచ్చునని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గద్దె ఏడుకొండలు తెలిపారు. అంతర్జాతీయ సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక అశ్విని వైద్యశాల సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. గుండెపోటు సంభవించినప్పుడు ఏవిధమైన చర్యలు తీసుకోవాలి, ఎలాంటి పద్ధతులు పాటించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

పామూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ జాతీయ రహదారి 167బీ పరిధిలో బైపాస్‌లు నిర్మించిన చోట గ్రామాలను అనుసంధానిస్తూ ఉన్న రహదారుల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. మండలంలోని దూబగుంట బైపాస్ నుంచి సీఎస్‌పురం రోడ్డు, కందుకూరు రోడ్డు మీదుగా నుచ్చుపొద, బైపాస్ వరకు ఏడు కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరయ్యాయి. సీఎస్‌పురం మండలం ఏకొత్తపల్లి, అయ్యలూరివారిపల్లి, డీజీపేట, సీఎస్‌పురం పరిధిలో 11 కి.మీమేర సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరయ్యాయి. కాగా, పట్టణంలోని మయూరి లాడ్జి నుంచి నెల్లూరు రోడ్డు బైపాస్ వరకు ఉన్న సింగిల్‌రోడ్డును డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.40 లక్షలు మంజూరుచేసినట్టు అధికారులు తెలిపారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

దర్శి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి.యోగేశ్వరరావు మాట్లాడుతూ గవాయ్‌పై దాడిజరిగి వారంరోజులు అవుతున్నప్పటికీ నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం దారుణమన్నారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.గోవిందప్రసాద్, జి.ప్రేమ్‌కుమార్, ఆర్.మోషే, ఆర్.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి చేసిన అడ్వకేట్ రాకేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని జైభీం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సూరే రాజన్న శుక్రవారం తహసీల్దార్ ఎన్.వాసుకు వినతిపత్రం అందజేశారు. గవాయ్‌పై అనాగరికంగా దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తిగా ఉన్న రాజ్యాంగం మీద జరిగిన దాడిగా పేర్కొన్నారు.

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు

దొనకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల డీలర్లు అధిక ధరలకు యూరియాను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి దుకాణం డీలర్ స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డులను తప్పకుండా రాయాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వటమే కాకుండా రైతు సంతకం కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

వైసీపీ జిల్లా యువజన ప్రధానకార్యదర్శిగా గోపాల్‌రెడ్డి

కనిగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన విభాగం జిల్లా ప్రధానకార్యదర్శిగా కనిగిరికి చెందిన మూలె గోపాల్‌రెడ్డిని పార్టీ అధిష్ఠానం నియామకం చేసింది. తనకు పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, కార్యదర్శిగా ఇర్రి కృష్ణారెడ్డిని, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌లుగా గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, బక్కా భాగ్యరాజ్‌ను నియమించారు.







జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బీచ్‌లో ఈతపై నిషేధం

- సముద్రతీరంలో పటిష్ఠమైన భద్రత
- మందుబాబులు సముద్రంలో దిగరాదు
- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బీచ్‌ల్లో ఈతపై నిషేధం అమలు చేయాలని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. తీర ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఎస్పీ పలు ఆదేశాలు జారీ చేశారు. మద్యం మత్తులో సముద్రంలో దిగడానికి వీలులేదన్నారు. తీరప్రాంతంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సూచించిన ప్రదేశాల్లో మాత్రమే పర్యాటకులు స్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయాప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలన్నారు. 167ఏ జాతీయ రహదారి త్వరలో అందుబాటులోకి వస్తే తెలంగాణ నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు ఓడరేవు, రామాపురం బీచ్‌లకు వచ్చే అవకాశం ఉందన్నారు. సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. బాపట్ల జిల్లా ప్రధానమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల్లో పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల చోటు చేసుకున్న విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. తీరం వెంట లైఫ్‌జాకెట్లు, గజఈతగాళ్లు, మెరైన్‌పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సముద్రంలో పడవలు ద్వారా గస్తీ నిర్వహించాలన్నారు. ఈ నెల 22 నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్నందున పుణ్యస్నానాలకు భక్తులు తరలివస్తారని దీనిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, ఎండీ మొయిన్, బాలమురళికృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐలు పి.సురేష్‌బాబు, కె.శ్రీనివాసరావు, శేషగిరిరావు, వైవి.రమణయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు గ్రీవెన్స్

ఫిర్యాదులు స్వీకరించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరగనున్న గ్రీవెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఈ క్రమంలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో బందోబస్తు ఏర్పాట్లను గుంటూరు ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం పరిశీలించారు. కార్యాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, వీవీఐపీ, వీఐపీ రాకపోకల మార్గాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

- 1.05 లక్షల ఎకరాల్లో తగ్గిన విస్తీర్ణం
- బర్లీ పొగాకు నిషేధం కూడా కారణమే
- వరి సాగుపై అన్నదాతల పునరాలోచన



పర్చూరు మండల పరిధిలో సాగుకు దూరంగా ఉన్న పొలాలు

ఖరీ..ఉఫ్

అదునులో వర్షాభావం.. ఆపై భారీ వర్షాలు.. వరదలతో ఖరీఫ్ కళ తగ్గింది. పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. ప్రకృతి విపత్తులకు తోడు ఏటికేడు పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లా లంటే గిట్టుబాటు ధరల భయం వెరసి ఖరీఫ్ సాగు కళ తగ్గింది. గతేడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్ సాగు విస్తీర్ణం దాదాపు 3,22,000 ఎకరాలు ఉండగా, ఈ సీజన్ లో అది 2,67,000 ఎకరాలకు పరిమిత మైంది. బర్లీ సాగుపై నిషేధంతో ఆ పొలా లన్నీ కూడా దాదాపు ఖాళీగానే ఉన్నాయి. జిల్లాలో దాదాపు 1,05,000 ఎకరాలు సేద్యానికి దూరంగా ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఖరీఫ్ సాగు గణనీ యంగా తగ్గినా ఇప్పటి వరకు అధికారులు సమీక్ష నిర్వహించలేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసు కోవచ్చు. వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి ఏయే మండలాల్లో అధిక విస్తీర్ణం ఖాళీగా ఉంచారో గుర్తించి అక్కడ లాభసాటి సేద్యం వైపుగా అన్నదాతలను మళ్లించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా వారు పట్టించుకోవడంలేదు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడు ఖరీఫ్ సాగు ప్రారంభ మైన మూడు వారాలకే వరదలు పొ లాలను ముంచెత్తాయి. ఇవి ఎక్కువగా బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజక వర్గాల పరిధిలోని రైతులపై తీవ్ర ప్రభావం చూపాయి. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారమే దాదాపు 68,000 ఎకరాల్లో వరి పైరు ముంపు బారిన పడినట్లు తేలింది. అప్పటికే ఎకరాకు రూ.7,000 నుంచి 10,000 వరకు ఖర్చు చేశారు. సాగు ప్రారంభంలోనే విపత్తు రైతును పలకరించింది. పైగా ప్రభుత్వం నుంచి రాయితీ విత్తనాల హామీ తప్ప మరే లాంటి భరోసా దక్క లేదు. దీంతో పలు ప్రాంతాల్లో రైతులు సాగుకు దూరంగా ఉన్నారు. గతేడాది పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో బర్లీ సాగైంది. జిల్లా వ్యాప్తంగా చూస్తే అది 62,000 ఎకరాల వరకు ఉంది. అయితే గత ఏడాది పరిణామాలతో ఖరీఫ్‌లో బర్లీ సాగుపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ పరిస్థితుల్లో ఈ దఫా ఏమి సాగు చేయాలో తెలియని అయోమయస్థితిలో రైతులు ఉన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేయాలని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎటువంటి ప్రణాళిక అమలు కాలేదు. దీంతో ఆయా భూములు సాగు లేక వెలవెలపోతున్నాయి.

కౌలు రైతులు వెనకడుగు

సాగు విస్తీర్ణంలో 75 శాతం కౌలు రైతులే చేస్తుంటారు. ఏటికేడే వారు అప్పుల్లో కూరుకుపోతుండడంతో ఈ ఏడాది వారు కూడా సాగుకు ఆశించిన స్థాయిలో ముందుకు రాలేదు. దీంతో ఖరీఫ్ సాగు గణాంకాలు తీసికట్టుగా దర్శనమిస్తున్నాయి. సీసీఆర్‌సీ కార్డుల జారీతోనే వ్యవసాయశాఖ సరిపెడు తుందే తప్ప దాని వల్ల కౌలు రైతులకు అందే ప్రయోజనం గుండుసున్నాగా కనబడుతోంది. దీనితో పాటు ప్రకృతి విపత్తులు వారిని కుదేలు చేస్తున్నాయి. దాని ఫలితమే ఈ ఏడాది ఖరీఫ్ సాగు అంచనాలకు ఆమడ దూరంలో నిలిచింది. ఈ ఏడాది ఈ-క్రాప్ నమోదులో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో సేద్యానికి అనువుగా ఉండి ఖాళీగా ఉన్న భూములు కూడా రికార్డుల్లోకి ఎక్కుతున్నాయి. ఇది దాదాపు 50,000 ఎకరాలు వరకు ఉండొచ్చని తెలుస్తోంది.

ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా...

రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనిచేసే యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల రైతుకు సేద్యం విషయంలో భరోసా ఎండమావిగానే మారింది. యూరియా నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయని ప్రభుత్వం చెప్పినా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ-క్రాప్ నమోదు దగ్గర నుంచి బీమా పరిహారం అందించే వరకు వ్యవస్థలు చేస్తున్న అనేక తప్పిదాలు రైతులకు గుదిబండలుగా మారాయి.

మాతా శిశు మరణాలను అరికట్టాలి

- వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృ,శిశు మరణాలు అరికట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మాతృ, శిశు మరణాల నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. అద్దంకి, వేటపాలెం మండలాల్లో మాతృ మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాన్పుల సమయంలో మరణాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విధినిర్వహణలో వైద్య విభాగం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గర్భిణులకు ఏడు నెల నుంచి గుండెపరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు.

- ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. పీఎంఎస్ఎంఏ అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. గర్భిణులకు ప్రతీ నెల 9న వైద్యపరీక్షలు విధిగా నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి స్పెషలిస్ట్ వైద్యులను అనుసంధానించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు గర్భిణులకు అందాలని తెలిపారు.
- జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యంపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇంకా 2,15,808 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని డిసెంబరు 31కి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్‌లో 64 పనులు ప్రారంభించని ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలన్నారు. పురోగతి ఉన్న 277 పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువులు, పైపులైన్ల మరమ్మతులకు రూ.9.94 కోట్లు మంజూరు చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవోలను కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి పథకాల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు.
- జిల్లాలో 308 మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌ల ద్వారా 229 మెట్రిక్‌టన్నుల యూరియాను 2,412 మంది రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

జీడి.. జిగేల్

- పిక్క దిగుబడి తగ్గడంతో ధరాభారం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీడి పిక్క ధర అమాంతంగా పెరుగుతోంది. ఈ ఏడాది దిగుబడి తగ్గింది. దీంతో క్రమేపి ధర పెరుగుతూ వస్తోంది. చీరాల పరి సర ప్రాంతాల్లోని వేటపాలెం, పందిళ్లపల్లి, చల్లారెడ్డిపాలెం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, రామన్నపేట ప్రాంతాల్లో వేల ఎకరా ల్లో జీడి సాగవుతోంది. గతేడాది 80 కేజీల పిక్క ధర సుమారు రూ.9 వేల నుంచి రూ.9.200 వరకు ఉంది. ప్రస్తుతం వ్యాపారులు రూ.11 వేల నుంచి రూ.12 వేలకు నాణ్యమైన రకం కొనుగోలు చేస్తున్నారు. పిక్కలను గ్రేడింగ్ చేసి పప్పుగా మార్చేం దుకు అదనంగా బస్తాకు రూ.3 నుంచి రూ.4 వేల వరకు కూలి భారం పడుతోంది. సగటున బస్తాకు దాదాపుగా 6 కేజీల తరుగు ఉంటుంది. బద్ద, గుండు, నూకగా వేరు చేయగా దాదాపు బస్తాకు 20 కేజీల పప్పు దిగుబడి మాత్రమే అందుతుంది. దీంతో ఖర్చులు, లాభాలను బేరీజు వేసుకుని కేజీ రూ.1250 నుంచి రూ.1300 వరకు దుకాణాదారులు విక్రయిస్తున్నారు.



విద్యార్థులకు సైకిళ్లు

10 వేలమందికి పంపిణీ లక్ష్యం

- ఇప్పటికే 3,038.. నేడు మరో 356 మందికి
- సైకిల్‌యాత్రలో విద్యార్థుల సమస్యలు గొట్టిపాటి దృష్టికి
- అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎస్ఆర్ నిధులతో మంత్రి పంపిణీ

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుదూరంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను అందరిలా చూసి వదిలేయలేదు. ఎన్నికలకు ముందు సైకిల్‌యాత్రలో అప్పటి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందజేయాలని సంకల్పం తీసుకున్నారు. ఈ క్రమంలో సుమారు పది వేల మందికి సైకిళ్లను అందచేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే 3,038 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయగా, శనివారం మరో 356 మంది విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. 2024 ఎన్నికలకు ముందు గొట్టిపాటి నియోజకవర్గంలో సైకిల్ యాత్ర చేపట్టగా పలు గ్రామాల్లో విద్యార్థులు పాఠశాలలకు నడిచి వెళ్తుండటాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో పలు కంపెనీలు సీఎస్ఆర్ నిధుల ద్వారా సామాజిక కార్యక్రమాలకు ముందుకు రావడంతో విద్యార్థులకు సైకిళ్ళు దివ్యాంగులకు ట్రై స్కూటర్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 533, ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 305, గొరకాయపాలెం హైస్కూల్‌లో 94, కొరిశపాడు మండలం తమ్మవరం హైస్కూల్‌లో 68, సోమవరప్పాడు యూపీ స్కూల్‌లో 13, తిమ్మనపాలెం హైస్కూల్‌లో 131, కొరిశపాడు హైస్కూల్‌లో 56, సంతమాగులూరు మండలం వెల్లలచెరువు హైస్కూల్‌లో 137, మక్కెనవారిపాలెం హైస్కూల్‌లో 349, కొమ్మాలపాడు హైస్కూల్‌లో 104, జె.పంగులూరు మండలం పంగులూరు హైస్కూల్‌లో 317, బూదవాడ హైస్కూల్‌లో 207, కొండమంజులూరు హైస్కూల్ లో 356 సైకిళ్లను పంపిణీ చేశారు. శనివారం అద్దంకి శింగరకొండ రోడ్డులోని కాకానిపాలెం హైస్కూల్‌లో 356 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయనున్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా బ్రాండెడ్ కంపెనీ సైకిళ్లను కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నారు.

కళాశాలల నుంచి వినతులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు కూడా సైకిళ్ల పంపిణీ చేయాలని ఇటీవల మంత్రిని అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. హైస్కూళ్ల విద్యార్థులకు పంపిణీ చేసిన తర్వాత పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



అద్దంకి: ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పంపిణీకి సిద్ధమైన సైకిళ్ళు (పాత చిత్రం)

అద్దంకి వాసులకు మెరుగైన వైద్యం

డయాలసిస్, ఏఆర్‌టీ సెంటర్లు మంజూరు ● త్వరలో ప్రారంభిస్తామన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ రోగులకు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు శుభవార్త. మెరుగైన వైద్యం కోసం అటు ఒంగోలు.. ఇటు గుంటూరు వెళ్లాల్సిన అవసరం లేకుండా అద్దంకిలోనే మెరుగైన వైద్యం త్వరలో అందుబాటులోకి రానున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అద్దంకికి డయాలసిస్, ఏఆర్‌టీ కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. ఐదు బెడ్ల డయా లసిస్ సెంటర్, ఏఆర్టీ(యాంటీ రెట్రోవిరల్ థెరపీ) కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ రెండు కేంద్రాలకు సంబంధించి భవనాల నిర్మాణం, ఆధునిక వైద్య పరికరాలు, అవసర మైన ఇతర వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కిడ్నీ రోగులు ఇప్పటి వరకు ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. అద్దంకి, దర్శి నియోజకవర్గాల పరిధిలోని కిడ్నీ రోగులకు అద్దంకిలోనే డయాలసిస్ చేయించుకునే అవకాశం ఏర్పడనున్నది. డయాలసిస్, ఏఆర్టీ కేంద్రాలు మంజూరు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.





హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

సంతమాగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో సంతమాగులూరుకు చెందిన రావూరి వెంకట నారాయణకు జీవిత ఖైదు, రూ.8 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఏ.భారతీ శుక్రవారం తీర్పు ఇచ్చారు. సంతమాగులూరు ఎస్టీ కాలనీలో 2021 డిసెంబరు 31న రావూరి వెంకట నారాయణ భార్యను అతి కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పటి పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి, వెంకటనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో ప్రస్తుతం న్యాయాధికారి తీర్పు వెలువరించారు. కేసు పూర్వపరాలు ఇలా ఉన్నాయి.. ఎస్టీకాలనీకి చెందిన రావూరి వెంకట నారాయణకి ఈర్ల అంకమ్మతో వివాహమైంది. అయితే భార్య అతడ్ని వదిలి వెళ్లిపోయింది. అదేవిధంగా మృతురాలు రావూరి మరియమ్మకు(31) మొదట వివాహమై ఆమె కూడా భర్తతో విడిపోయింది. అనంతరం వెంకట నారాయణ, మరియమ్మ 2018లో వివాహం చేసుకున్నారు. అయితే ఆమెపై అనుమానం పెంచుకున్న వెంకటనారాయణ తరచూ గొడవపడేవాడు. చంపేస్తానని బెదిరించేవాడు. ఈ క్రమంలో 2021 డిసెంబరు 31న రాత్రి వెంకట నారాయణ ఇంటికి వచ్చే సరికి భార్య ఇంట్లో లేదు. అనంతరం ఇంటికి వచ్చిన భార్యపై అనుమానంతో కత్తితో దాడి చేశాడు. ఆమె తప్పించుకొని పారిపోయే క్రమంలో ఇంటిబయట కిందపడగా, ఆమెపై పాశవికంగా దాడి చేసి హత్య చేశాడు. మృతదేహాన్ని గ్రామ సమీపంలోని పంట కాల్వలో పడేశాడు. గ్రామంలో చలంచర్ల చలమయ్య ఇంటి వద్దకు రాగా, అక్కడ నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న మృతురాలి అల్లుడు రాచూరి ప్రసన్న, మరికొంత మంది యువకులు నారాయణ ప్రవర్తనలో మార్పు గమనించారు. గట్టిగా ప్రశ్నించగా భార్యను హత్య చేసిన విషయం తెలిపాడు. మృతదేహాన్ని వారికి చూపించి పారిపోయాడు. రాచూరి ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ జి.శివన్నారాయణరావు కేసు నమోదు చేశారు. అప్పటి అద్దంకి సీఐ ఎం.రాజేష్ కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ చేపట్టారు. పి.వసుంధర వై.ప్రశాంత కుమారి కోర్టులో వాదోపవాదాలు వినిపించారు.



రూ.1.44 కోట్లతో తమ్మవరం రోడ్డు

నేడు ప్రారంభోత్సవానికి మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో గోతుల మయంగా మారిన రోడ్లు వాహన చోదకులకు నరకం చూపాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల మరమ్మతులకు, నిర్మాణాలపై దృష్టి సారించింది. ఆయా రోడ్లకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. అద్దంకి నియోజకవర్గంలో మొదటి విడతగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంజూరు చేయించిన నిధులతో పలు రోడ్ల నిర్మాణంలో ఉండగా, ఇప్పటికే కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకుని వాహన దారులకు ఊరట కలిగిస్తున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్, నాబార్డు, పంచాయతీరాజ్ నిధులతో అనేక గ్రామాల్లో తారురోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు 5 కిలోమీటర్ల తారు రోడ్డును రూ.1.44 కోట్లతో నిర్మించారు. దీంతో ఈ రోడ్డును శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. రోడ్డు నిర్మాణంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కల్తీ వరి విత్తనాలతో రైతులు రోడ్డుపాలు

న్యాయం చేయాలని రైతు సంఘం నాయకుల డిమాండ్

కొల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కల్తీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులు రోడ్డున పడ్డారని వారికి న్యాయం చేయాలంటూ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన 35 మంది రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో కొల్లూరులోని వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించి ఏవో సురేంద్రబాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ, గత పది రోజుల క్రితం ఎన్నార్టై విత్తన సంస్థ అందించిన బిపిటి విత్తనాలు బెరుకు ఉందని రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించడం జరిగిందన్నారు. దీంతో మండల వ్యవసాయాధికారి అనంతవరంలో బెరుకు వచ్చిన వరి పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్నార్టై విత్తన పరిశోధన ప్రతినిధులతో చర్చించారు. వారు కూడా గ్రామానికి చేరుకుని రైతుల సమక్షంలో పంట పరిశీలన అనంతరం పంటలో బెరుకు వచ్చిన మాట వాస్తవమని ఎకరాకు ఐదు బస్తాల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, తమ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధులతో చర్చించి న్యాయం చేస్తామంటూ 15వ తేదీ వరకు గడువు కావాలని కోరారన్నారు. అంగీకరించిన రైతులకు ఇప్పుడు తమకేం సంబంధం లేదని విత్తన సంస్థ ప్రతినిధులు చేతులు ఎత్తి వేయడంతో ఎన్నార్టై విత్తనాలను పండిస్తున్న రైతులు తమకు న్యాయం చేయాలంటూ వ్యవసాయ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. వినతి పత్రం ఇచ్చిన ఏవో పట్టించుకోకపోవడంతో కడుపు మండిన రైతులు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద తెనాలి-రేపల్లె ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఎన్నార్టై సంస్థ నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు అధికారులు, నాయకులు స్పందించి న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల నాగరాజు, మండల నాయకులు సుబ్బారావు, రైతులు ధూళిపాళ్ల రవి, జాలాది రంగారావు, నాగళ్ల కృష్ణారావు, ధూళిపాళ్ల చిన్న, కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల రాంబాబు, ధూళిపాళ్ల నాని, కౌలు రైతులు రామకోటయ్య, వాసు, రామారావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట బైఠాయించిన అనంతవరం గ్రామ రైతులు

APSRTC
SHORT TENDER NOTICE
పల్లె వెలుగు
Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1. Cleaning of Open Drain in PNBS, Vijayawada. 2. Annual & Periodical Maintenance to Bus Station Building at Machilipatnam, in Krishna District. 3. Providing CC Pavement from entrance gate to Garage in Bus Depot at Bapatla, Bapatla District. 4. Structural repairs and removing of damaged RCC Cantilever Slab Portion in Bus Station at Guduru, Tirupati District. 5. Repairs and Improvements to Platforms 1 to 13 in Bus Station at Ananthapuramu, Ananthapuramu District. 6. Structural Repairs and Annual & Periodical Maintenance to the Bus Station at Rajampeta, Annamayya District. 7. Periodical Maintenance to the Bus Station at Madanapalli, Annamyya District. 8. Construction of New Toilet Block in Bus Depot at Rayadurg, Ananthapuramu District. 9. Providing Cement Concrete Pavement in Bus Depor Yard (near Garage) at Rayadurg, Ananthapuramu District. 10. Retrofitting of Toilets with supporting Slab for water storage Tanks in Bus Station at Nandyala, Nandyala District. For full Tender Notice please visit "www.apsrtc.ap.gov.in". For Online participation please visit "https://tender.apeprocurement.gov.in". NOTE: Bid Document download Start Date & Time: 31.10.2025, 4.00 PM, Bid Submission Closing Date & Time : 10.11.2025, 4.00 PM. Further details: Ph. No: 7095272225 (10.00 AM to 5.30 PM). APSRTC reserves the right to cancel or reject any tender or all the tenders of this notification without assigning any reason at any stage.
NIT NO. 18/CCE/APSRTC/2025-26, Dt.17.10.2025
Chief Civil Engineer, APSRTC, Vijayawada

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"'తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.





క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దు

● యువతకు సీఐ సుబ్బారావు సూచన

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో యువతీ యువకులు, ప్రజలు క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు తీసుకోరాదని వన్‌టౌన్ సీఐ సుబ్బారావు సూచించారు. శుక్రవారం పట్టణంలో 17 సంవత్సరముల మైనర్ బాలిక లగేజీతో అనుమానస్పదంగా సంచరిస్తుండగా, శక్తీ టీం గుర్తించింది. దీంతో ఆమెతో మాట్లాడి విషయం తెలుసుకోగా తల్లిదండ్రులతో గొడవపడి బయటకు వచ్చేసినట్లు చెప్పడంతో వెంటనే ఆమెను సీఐ స్టేషన్‌కు పిలిపించి, తల్లిదండ్రులతో కౌన్సిలింగ్ చేశారు. ఒంటరిగా చిన్నారులు బయటకు వెళ్లడం ప్రమాదమని సూచించారు. సీఐ వెంట ఎస్సై రాజ్యలక్ష్మీ, సిబ్బంది ఉన్నారు.

నూజెళ్లపల్లె సాగర్ కాలువ డ్రాప్ వద్ద గండి

● వృథాగాపోతున్న జలాలు



వృథాగాపోతున్న సాగర్ జలాలు

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్లపల్లె గ్రామానికి దక్షిణంగా ఉన్న సాగర్ మైనర్ కాలువ పరిధిలో డ్రాపు శిథిలావస్థకు చేరింది. దీంతో సాగర్‌జలాలు వృథాగా పోతున్నాయని టీడీపీ గ్రామ నాయకులు గొట్టిపాటి కాజా అన్నారు. డ్రాప్ వద్ద నుంచి నీరు ముందకు నడవడం లేదని, ఎగువనుండి వచ్చే సాగర్‌కాలువ నీరు ముందుకుపోవడం లేదన్నారు. నీరు వృథాగా పంట పొలాల్లోనికి పారుతోందని దీంతో పొలాలు దెబ్బతింటున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు. అధికారులకు తెలియజేసినా వారు స్పందించడం లేదని ఆరోపించారు. సాగర్‌కాలువ డ్రాపునకు తగిన మరమ్మత్తులు చేపట్టి నీటిపారుదలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

జెండా పండుగలో పాల్గొన్న గౌరీఅమర్నాథ్

దేశాయిపేట(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం దేశాయిపేటలో నిర్వహించిన జెండా పండుగ వేడుకల్లో శుక్రవారం రాత్రి టీడీపీ యువనాయకులు గౌరీఅమర్నాధ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ముస్లింలు నిర్వాహకులు నిర్వహించిన పవిత్ర ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 కింద వేతనాలు ఇవ్వాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ వీడియో సందేశాన్ని వినిపించారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, బకాయిలు విడుదల చేయాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరెడ్డి, సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎ.ప్రసాద్, ఎ.భాస్కరరావు, ధనమ్మ, జి.శాంసన్, వై.మృదుల్‌కుమార్, లక్ష్మి, కొడమల శాంసన్, గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అధ్యక్షుడు డీవీ.సుబ్బారెడ్డి, ఓబీవీ. సుబ్బారావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో జాప్యం చేస్తే సస్పెండే

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు

కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ రాజాబాబు హెచ్చరించారు. మండల స్థాయిలో అభివృద్ధి అధికారులకు గ్రామాభివృద్ధే ప్రధాన కర్తవ్యం అని, నిర్లక్ష్యంచేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఎస్సీ ప్రజలు అధికంగా ఉండే గ్రామాల్లో పీఎం-ఏజేఏవై పథకం అమలు తీరుపై శుక్రవారం స్థానిక కలెక్టర్ సమావేశపు హాలులో జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా జిల్లా సాంఘికసంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ ఈపథకంలో భాగంగా గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, సామాజిక భద్రత, గ్రామీణ రోడ్లు, ఇళ్ల నిర్మాణం, విద్యుత్, మెరుగైన వ్యవసాయం తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై కలెక్టర్ స్పందిస్తూ వచ్చిన నిధులను వినియోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఫేజ్-1లో మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరును కూడా నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని ఎంపీడీవోలను ఆదేశిచారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, బాలశంకరరావు, నారాయణ, కిరణ్‌కుమార్, వరలక్ష్మీ, వెంకటేశ్వర్లు, అశోక్ పాల్గొన్నారు.

మంత్రి వచ్చాక మరుగుదొడ్లు శుభ్రమయ్యాయ్..



ఆ గురుకుల పాఠశాలలో లోపల ఎలా ఉంటుందో తెలియదు గాని బయటకు మాత్రం జాతీయ రహదారి వెంబడే ఆహ్లాదకర వాతావరణంలో కనిపిస్తోంది. కానీ గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ఆకస్మిక తనిఖీ చేసి పాఠశాలలో ఉన్న లోపాలు గుర్తించటంతో ఇప్పుడు అందరినోట ఆ పాఠశాల మాట వినబడుతోంది. అదే త్రిపురాంతకం మండలం దూపాడులోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల. మీడియాను, స్థానిక నాయకులను కూడా వెంట రానీయకుండా మంత్రి స్వయంగా పాఠశాల పరిస్థితిని పర్యవేక్షించి సిబ్బందిని హెచ్చరించి లోపాలు సరిదిద్దుకోవాలని, విద్యార్థినులకు ఇబ్బంది కలిగిస్తే సహించనని హితబోధ చేశారు. అంతే శుక్రవారం చకచకా లోపల నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను శుభ్రపరిచి, అల్లుకున్న నిర్లక్ష్యపు తీగలు, చెట్లు తొలగింపు చేపట్టి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. మంత్రి ఆదేశాలతో శుభ్రపరిచామని ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. అంటే మంత్రి వస్తేగాని మరుగుదొడ్లు శుభ్రం కావా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి

తెలుగు వెలుగులు చాటిన గొట్టిపాటి రమణ

● ఖతార్‌లో తెలుగు ప్రవాసీ సంఘ సభ్యుడిగా కామేపల్లి వాసి విజయం

● టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగంలో కీలక బాధ్యతలు



గొట్టిపాటి రమణ

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన గొట్టిపాటి రమణ గల్ఫ్‌లోని ఖతార్ దేశంలో ఉంటూ తెలుగు వెలుగులను చాటాడు. అక్కడ జరిగిన తెలుగు ప్రవాసీ సంఘం ఎన్నికల్లో తనతోపాటు మరో 9మందిని గెలిపించడంలో రమణ కీలకపాత్ర పోషించారు. తెలుగు వారికి అండగా, టీడీపీ విభాగంలో కీలకంగా పనిచేస్తున్నారు. భారతీయ ఎంబసీ ఆధ్వర్యంలోని ఐసీసీ అనే భారతీయ సంఘాల సమాఖ్య పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరగ్గా విజయంలో రమణ కీలకపాత్ర పోషించారు. కామేపల్లి నుంచి 20 ఏళ్ల క్రితం ఖతార్ వెళ్లిన రమణ అక్కడ ప్రముఖ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. జిల్లాకు చెందిన అనేక మంది ఇంజనీర్లకు ఉద్యోగ, ఉపాధి కల్పనలోనూ, పేదలకు విద్యనందించడంతోపాటు, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అండదండలు అందిస్తున్నారు. రమణకు ఇద్దరు కుమార్తెలు వైద్య విద్యలో పీజీ చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన రమణ ఖతార్‌లో పేరు ప్రఖ్యాతులు సాధించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరులో నేత్రదానం

పంగులూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శుక్రవారం నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన పెంట్యాల వెంకటనారాయణ(ఉరఫ్ ముఖ్యమంత్రి) మరణించాడు. స్థానిక రోటరీక్లబ్ సహకారంతో కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఆ సమాచారాన్ని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావులు కాకాణికి చెందిన శంకర్ నేత్రాలయం వారికి తెలియజేశారు. పంగులూరు చేరుకున్న శంకర్‌కంటి వైద్యశాల సిబ్బంది మృతుడు వెంకటనారాయణ కంటి కార్నియాను సేకరించారు.

డ్రై క్లీనింగ్ దుకాణంలో అగ్నిప్రమాదం



దగ్ధమైన డ్రై క్లీనింగ్ సెంటర్

మేదరమెట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల బస్టాండ్ సెంటర్ సమీపంలోని డ్రై క్లీనింగ్ దుకాణంలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో దుకాణం లోని సామగ్రి, వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అద్దంకి అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని, దుకాణం యజమాని స్వరూపదేవి తెలిపారు.

పవన్ గోపీకృష్ణకు సీఎం అభినందన



గోపీకృష్ణను అభినందిస్తున్న సీఎం

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్ వ్యాసరచనలో జిల్లాస్థాయిలో సత్తాచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి సీ.హెచ్. పవన్ గోపీకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. సూపర్ జీ.ఎస్.టీ, సూపర్ సేవింగ్స్ పోటీలలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పవన్‌గోపీకృష్ణ ఈ నెల 16న కర్నూల్‌లో ప్రధాని నరేంద్రమోడీతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. కర్నూల్‌లో జరిగిన సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ సభ ముగిసిన అనంతరం రాష్ట్రస్థాయిలో ఈ అంశంపై ప్రతిభచాటిన పది మంది విద్యార్థులు శుక్రవారం ఉండవల్లి లోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిశారు. ఈ సందర్భంగా పవన్‌గోపీకృష్ణను సీఎం అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటి ముఖ్యమంత్రితో ప్రశంసాపత్రం అందుకున్న పవన్‌గోపీకృష్ణను గ్రామపెద్దలు చింతల సహదేవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, బొప్పూడి నాగేశ్వరరావు, హెచ్‌ఎం అనిత పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

వేటపాలెం(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం బాలికోన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజని స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు సరళాదేవీ, ఉపాధ్యాయులు ఉచితంగా ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో ప్రధానోపధ్యాయురాలు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన బ్లూప్రింట్ ఆధారంగా మెటీరియల్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, అంజమ్మ, రాంబాబు, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం జరిగే పలు కార్యక్రమాలకు విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ హజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులోని కాకానిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బంగ్లారోడ్డులో జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో పాల్గొననున్నారు.

అవీ..ఇవీ..

బాలికలకు ఆటల పోటీలు

మార్టూరు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు ఆటలపోటీలను నిర్వహించారు. అనంతరం ఈ పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, సువర్ణ, సుధ, కవిత, రాసిగ్న తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై వరల్డ్ హెల్త్ టీం సర్వే

బల్లికురవ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు జిల్లా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో సర్వే చేశారు. ముందుగా గుంటుపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన వారు అనంతరం వారు ఉప్పుమాగులూరు పంచాయతీ శివారు గ్రామం అయిన సోమవరప్పాడులో పది గృహాలకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఎలాంటి వైద్య వసతులు అందుతున్నాయి. అని వారిని అడిగి తెలుసుకున్నారు. అలానే అన్ని రకాల వ్యాక్సిన్లు వేస్తున్నారా లేదా అని పరిశీలన చేశారు. ప్రజలు కూడా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియెగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్లు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వారు వివరించారు. ఈ పరిశీలనలో గుంటుపల్లి వైద్యశాల ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం హసీనా, ఆశావర్కర్ లక్ష్మీశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో రావినూతల విద్యార్థినికి ప్రథమస్థానం


మధువర్షిత

మేదరమెట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచింది. శుక్రవారం చీరాలలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లో 'క్వాంటమ్ ఏజ్ బిగిన్స్, పొటెన్షియల్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. రాత పరీక్ష, ప్రజెంటేషన్, క్విజ్ అనే మూడు సాధనాల ద్వారా విద్యార్థులను న్యాయ నిర్ణేతలు పరీక్షించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీలో రావినూతల జెడ్పీహెచ్ఎస్ నుంచి 9వ తరగతి చదువుతున్న సీహెచ్. మధువర్షిత పాల్గొని ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన మధువర్షితను పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్, గ్రామస్థులు అభినందించారు.

శాస్త్రీయ జ్ఞానంతో ఉన్నత శిఖరాలు

- చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గంగాధరరావు


ప్రశంసాపత్రాలతో విజేతలు

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానాన్ని సాధించడం వలన ఉన్నత శిఖరాలు చేరుకుంటారని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గంగాధరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్ఆర్ అండ్‌పీఎం హై స్కూల్లో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సాధిక్, ప్రధానోపాధ్యాయులు సాల్మన్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నది శుభ్రపడేదెప్పుడో..!

స్నానాల ఘాట్‌లు ఏర్పాటు చేస్తే అభివృద్ధికి అవకాశం


దట్టంగా పెరిగిన తుమ్మచెట్లు, జమ్ము

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు గుండ్లకమ్మ నదిలో పవిత్ర స్నానాలు, కార్తీక స్నానాలు చేసే వారు.. అయితే ప్రస్తుతం అటు వైపు వెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు కొట్టుకుపోయి నీరు నిల్వ లేకుండా పోయింది. దీంతో అద్దంకి పట్టణం సమీపంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరిగాయి. చిట్టడవిని తలపించేలా చెట్టు, జమ్ము పెరిగింది. ప్రస్తుతం గుండ్లకమ్మ రిజర్వాయర్ లో పూర్తిస్థాయిలో నీరు నిలిచి ఉంది. అద్దంకి సమీపంలో కూడా గుండ్లకమ్మ నది నిండా నీరు నిలిచింది. అయితే పెద్ద ఎత్తున చిల్లచెట్లు, జమ్ము ఉండడంతో అటు వైపు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. అద్దంకి పట్టణం సమీపంలో గుండ్లకమ్మ నది ప్రాంతాన్ని శుభ్రం చేసి స్నానాల ఘాట్‌లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ప్రతి నిధులకు, అధికారులకు వినతి పత్రాలు కూడా ఇచ్చారు. ఈ నేపథ్యం లోనే గత ఏడాది గుండ్లకమ్మ నది ప్రాంతం సర్వే కూడా చేశారు. అయితే అనంతరం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. అద్దంకి పట్టణానికి ఆనుకొని గుండ్లకమ్మ నది ప్రవహిస్తున్న నేపథ్యంలో స్నానాల ఘాట్‌లు, పార్క్‌లు అభివృద్ధి చేస్తే అటు భక్తులు, ఇటు ప్రజలకు ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది. గుండ్లకమ్మ నదిని అభివృద్ధి చేస్తే గతంలో వలే దీక్షా భక్తులు కార్తీక స్నానాలు చేసేందుకు, మహిళలు పవిత్ర స్నానాలు చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి గుండ్లకమ్మ నదీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.


నదిని పూర్తిగా కమ్మేసిన తూటకాడ

కోనంకి -వలపర్ల రోడ్డులో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రెండురోజుల నుంచి ముమ్మరంగా పనులు


నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

మార్టూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనంకి నుంచి వలపర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రక్కన కొత్తగా విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేస్తున్నారు. రెండు మూడు రోజుల నుండి రోడ్డు పక్కన పాత స్థంభాలను, శిథిలమైన వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటుచేస్తున్నారు. వాస్తవంగా చాలా కాలం క్రితం రోడ్డుపక్కన ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు శిథిల దశకు చేరి పడిపోయే దశలో ఉన్నాయి. వర్షాలు కురిసినా, గాలులు వీచినా కరెంటు తీగలు తెగిపోయి, విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. దానికితోడు రోడ్డుపక్కన సుబాబుల్ చెట్లు, కొమ్మలు విద్యుత్ తీగలకు తగలడంతో పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వాటిని తిరిగి బాగు చేసి విద్యుత్ సరఫరాను చేయడం విద్యుత్ సిబ్బందికి శ్రమతో పాటు సమయం కూడా జాప్యమవుతోంది. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించిన మార్టూరు సబ్ డివిజన్ విద్యుత్ డీఈఈ ఎం. సురేంద్రబాబు ఉన్నత అధికారులతో మాట్లాడి, ముందుగా పాత స్తంభాలను తొలగించాలని, వాటి స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటుకు అనుమతులు పొందడంతోపాటు, కొత్త స్తంభాలు వచ్చే విధంగా కృషి చేశారు. దీంతో కొత్తస్తంభాలు, కొత్తగా తీగలను ఏర్పాటుచేస్తున్నారు. ఇక స్తంభాల వెంబడి చెట్లను కూడా తొలగిస్తు న్నారు. అదేవిధంగా వలపర్ల గ్రామంలో కూడా ఏళ్ల తరబడి శిథిలమైన స్తంభాల కారణంగా కరెంటు తీగలు కిందకు వేలాడుతుండటంతో అధికారులు ప్రత్యేకంగా చర్యలను తీసుకుంటున్నట్లు శుక్రవారం విద్యుత్ ఏఈ జి.రామాంజనేయులు తెలిపారు.

గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి విశేష కృషి

- ఘనంగా మాజీ ఎంఎల్‌సీ మాణిక్యరావు శతజయంతి
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి మాజీ ఎంఎల్‌సీ మాణిక్యరావు విశేష సేవలు అందించారని మాజీ ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజ్ ఆధ్వర్యం లో శత జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాణిక్యరావు కుమారుడు విజయ్‌కుమార్, గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపల్ మోజెస్, విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.



రేపు బాపట్ల జిల్లా హేతువాద సంఘ మహాసభలు

ఇంకొల్లు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే ఫ్లైఓవర్ కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో బాపట్ల జిల్లా హేతువాద సంఘ మహాసభలు హేతువాద మానవవాద అధ్యయన తరగతులు ఈ నెల 19 నుంచి జరుగుతాయని భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు ప్రముఖ హేతువాదులు హాజరై పలు అంశాలపై చర్చిస్తారన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి


డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఛైర్మన్

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. శుక్రవారం 1వ వార్డు రామనగర్, 15వ వార్డు యాదవపాలెం ప్రాంతాల్లో పర్యటించి డ్రెయినేజీ పనులను పరిశీలించారు. పారుదల లేని డ్రెయిన్లపై ఎమ్మెల్యే కొండయ్య సూచనల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అలాగే 4వ వార్డులో ఫిష్ మార్కెట్ స్థలాన్ని పరిశీలించి వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ఛైర్మన్ వెంట ఏఈ రవికుమార్, కౌన్సిలర్ జగదీష్ తదితరులు ఉన్నారు.

మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోండి

- కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చినగంజాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని, జిల్లా కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ జి.ఇందిరా ప్రియదర్శిని, ఎంఈవో-1 బి.అజయ్‌బాబులు అన్నారు. రాష్ట్ర సమగ్రశిక్ష వారి ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని కౌమార దశ బాలికలకు వారి కౌమారదశ సమస్యలు, ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత, విద్యకు సంబంధించి రెండురోజులు పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థినులకు ప్రేరణ, కౌమారదశ సమస్యలు, అధ్యయన ప్రణాళిక, బుద్ధి పూర్వకత తదితర అంశాలపై కార్యకలాపాలను నిర్వహించినట్లు ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. ముగ్గురు విద్యార్థినులకు వ్యక్తిగత సెషన్ నిర్వహించి, వారి వ్యక్తిగత సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి పలు సూచనలు ఆమె అందజేశారు. ఉపాధ్యాయుల ఓరియంటేషన్ సెషన్‌లో ఎంఈవో పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొప్పెరపాడులో కుక్కల దాడిలో మరో గొర్రె మృతి

- రెండవరోజు గొర్రెను చంపిన గ్రామసింహాలు


మృతిచెందిన గొర్రె

బల్లికురవ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెర పాడు గ్రామంలో వీధి కుక్కలు రెండో రోజు కూడా హల్‌చల్ చేశాయి. గురువారం షేక్ వలి అనే రైతుకు చెందిన 16 పోటేళ్లను కుక్కలు కరవడంతో మృతి చెందాయి. శుక్రవారం కూడా వీధి కుక్కలు మరో గొర్రెను కరిచి చంపాయి. దీంతో గ్రామంలో గొర్రెల కాపరులు బెంబేలెత్తి పోతున్నారు. వీధికుక్కల తాకిడి రోజురోజుకు అధికం అయిందని వీధుల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని అధికారులు వెంటనే వీధి కుక్కలను పట్టే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్లపై పారుతున్న మురుగు నీరు

- కొన్ని నెలలుగా అందుబాటులో లేని గ్రామ ప్రజాప్రతినిధి


రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బల్లికురవ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమలతో కళకళలాడే వేమవరంలో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాలువల్లో వ్యర్థాలు తీయకపోవడంతో గ్రామంలో ఎటూ వైపు చూసిన రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. గ్రామంలో ప్రధాన రోడ్డులో అయితే మురుగు విలయ తాండవం చేస్తోంది. గ్రామ సర్పంచ్ కొన్ని నెలల నుంచి గ్రామంలోకి రాలేదని పారిశుధ్య పనులు చేయించడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పట్టణ ప్రాంతంలో ఉన్న సర్పంచ్‌కు అధికారులు ఫోన్ చేస్తే నేను సర్పంచ్ పదవికి రాజీనామా చేశానని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో ఎవరు పారిశుధ్య పనులు చేయించలేక పోతున్నారు. పరిశ్రమలతో పన్నులు కూడా పెద్దఎత్తున గ్రామ పంచాయతీకి వస్తున్నాయని అధికారులు వెంటనే గ్రామంలో పారిశుధ్య పనులు చేయించాలని, సర్పంచ్ అందుబాటులో లేకుంటే అధికారులే పనులు చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం

- రూ.40లక్షల విరాళాన్ని అందించిన జనసేన నేత శ్రీకాంత్
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం


మన్నెం శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పర్చూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వై.జంక్షన్‌లో వేంచేసిన 95 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ దేవస్థానంలో వంటశాల నిర్మాణానికి ప్రవాసాంధ్రుడు, జనసేన నేత మన్నెం శ్రీకాంత్ రూ.40 లక్షల విరాళాన్ని అందజేసి భక్తిని చాటుకున్నారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం దుశ్శాలువా పూలమాలతో శ్రీకాంత్‌ను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, తులసి శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, గోగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూతన పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు


కాలనీవాసులతో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏఎంసీ నాగిరెడ్డి

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు ఎస్‌సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను సమగ్ర శిక్ష ఏపీసీ నాగిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆగస్టు నెలలో గ్రామంలో పర్యటించిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కాలనీవాసులు పాఠశాల దుస్థితిపై చేసిన విజ్ఞప్తి మేరకు చందలూరు ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను పరిశీలించి వాటి స్థానంలో నూతన భవననిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించిన ఏపీసీ నాగిరెడ్డి త్వరలో నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించి పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కాలనీ వాసులతో మాట్లాడారు. వీరివెంట సమగ్ర శిక్ష ఈఈ నాగజ్యోతి, ఎంఈవో జి.వీరాంజనేయులు, పాఠశాల హెచ్ఎం అద్దంకి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా వైసీపీ కోటి సంతకాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం వెంకటేష్

రామకృష్ణాపురం(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ప్రజలకు అండగా ఉండేందుకే వైసీపీ కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్నట్లు నియోజక వర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. ఆ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం వైసీపీ క్యాంపు కార్యాలయం, దేశాయిపేట, వేటపాలెం గ్రామాల్లో నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు పూనుకున్న పన్నాగాన్ని తిప్పి కొడతామన్నారు. పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వారివెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోటిసంతకాల సేకరణ

అద్దంకి : వైద్యకళాశాల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమం శుక్రవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 5వ వార్డు పరిధిలో ఉన్న రాజీవ్‌కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైద్యకళాశాలల ప్రవేటీకరణను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, కొల్లా భువనేశ్వరి, ఫణి తదితరులు పాల్గొన్నారు.







వరద పెరిగే చాన్స్

సోమశిల డ్యాంకు 14,946 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 14,946 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 73.689 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500 ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.పె న్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురుస్తున్నందున శనివారానికి వరద పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు బావిస్తున్నారు.

● కండలేరులో 59.990 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 59.990 టీఎంసీల నీరుందని డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 3790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 2700 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని పేర్కొన్నారు.

కాల్చితే ఆనందం.. పేలితే ప్రమాదం!

దీపావళి కారాదు విషాదం

● నిర్లక్ష్యంగా బాణసంచా కాల్చవద్దు ● అప్రమత్తంగా లేకుంటే అనర్థమే
● అస్తమా, సీవోపీడీ రోగులు దూరంగా ఉండాలి ● కళ్లు, చర్మానికి పొంచి ఉన్న ప్రమాదం

దీపావళి అంటేనే బాణసంచా వేడుకలు. వాటిని కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పలు ప్రమాదాలకుతోడు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీపావళి వచ్చిందంటే పిల్లలు, పెద్దల్లో హడావుడి కనిపిస్తుంది. ఈ పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. దీపావళి రోజున పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి ఇళ్ల ముందు దీపాలతో అలంకరించి బాణసంచా పేల్చుతారు. బాణసంచా కాల్చే సమయంలో పిల్లలు కానీ, పెద్దలు కానీ ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, మొరటుగా వ్యవహరించినా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈనెల 20న దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాలుస్తుంటారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు పొంచి ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



నెల్లూరు (వైద్యం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తయారు చేస్తున్న బాణసంచాలో రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటివల్ల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. బాణసంచాలో పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరైట్స్, పోటాషియం పర్ క్లోరేట్స్, చార్‌కోల్, సల్ఫర్, మాంగనీస్, సోడియం ఆక్సలేట్స్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, స్ట్రాన్షియం నైట్రేట్, బేరియం నైట్రేట్ తదితర రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. రాకెట్లు, చిచ్చుబుడ్లు పేల్చినప్పుడు అందులోని పాలిక్లోరినేటెడ్ డై ఆక్సిన్స్ ఫూరాన్స్‌తోపాటు అనేక విషపదార్థాలు వాతావరణంలో కలుస్తాయి. వీటితోపాటు ఓజోన్ పొరను దెబ్బతీసే నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదలవుతాయి.

అశ్రద్ధ చేస్తే వచ్చే రుగ్మతలు

- కళ్ల మంటలు, ఊపిరితిత్తుల్లో నెమ్ము
- గొంతు వాపు, జలుబు, తలనొప్పి, ఛాతీలో బరువు
- శ్వాసకోశ ఇబ్బందులు
- టపాసుల పొగ పీల్చాక పది, పదిహేను నిమిషాల్లో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది.
- మానసిక, నరాల సమస్యలు
- రక్తసంబంధిత వ్యాధులు
- గుండె జబ్బులు, క్యాన్సర్ కారక వ్యాధులు
- నిద్రలేమి, వినికిడిశక్తి తగ్గిపోవడం, హైబీపీ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- టపాసులు కాల్చేటప్పుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులు ధరించరాదు.
- శిల్క్ దుస్తులు ధరించరాదు. కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.
- పేలుడు పదార్థాలు కాల్చేటప్పుడు పెద్దలు చిన్నారుల దగ్గరుండాలి.
- సంగ కాలిన టపాకాయల వద్దకు వెళ్లకూడదు.
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెల మధ్యన టపాసులు పేల్చరాదు.
- టపాకాయలు కాల్చేటప్పుడు నీరు, ఇసుకను దగ్గరగా ఉంచుకోవాలి.
- తారాజువ్వలను నిలువుగా ఉంచి కాల్చాలి.
- చేతుల్లో టపాసులు కాల్చరాదు.
- చిచ్చుబుడ్డులు చేతుల్లో ఉంచి కాల్చరాదు.
- నివాసాల్లో టపాసులు నిల్వ ఉంచినప్పుడు పిల్లలకు అందకుండా ఉంచాలి.
- పెట్రోలు బంకులు దగ్గరగా ఉన్నచోట టపాసులు కాల్చరాదు.
- టపాసులకు సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు.
- టపాసులు కాల్చేటప్పుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి.

కళ్లపై తీవ్ర ప్రభావం



టపాకాయల ప్రభావం కంటిపై తీవ్రంగా ఉంటుంది. టపాసుల్లో పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరైట్స్, పోటాషియం పర్ క్లోరేట్స్, చార్‌కోల్, సల్ఫర్, మాంగనీస్, సోడియం ఆక్సలేట్స్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, స్ట్రాన్షియం నైట్రేట్, బేరియం నైట్రేట్, మొదలైన వెలుగులు విరజిమ్మే రసాయనాలు ఎక్కువగా ఉంటాయి. వీటిద్వారా వెదజల్లే రసాయనాలు కంటిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే కంటిపై పొర దెబ్బతినే అవకాశం ఉంటుంది.

\- డాక్టర్ శార్వాణి, ప్రభుత్వ కంటి వైద్యురాలు

చర్మంపై ప్రభావం ఎక్కువే



టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే చర్మం కాలిపోయే అవకాశం ఉంటుంది. ఒక్కోసారి చిచ్చుబుడ్డిలు పేలిపోయే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఒంటిపై పడి చర్మం కాలే అవకాశం ఉంది. బాణసంచా పేల్చేటప్పుడు అజాగ్రతగా ఉంటే చర్మం కాలి బొబ్బలెక్కే అవకాశం కూడా లేకపోలేదు. చిన్నగాయమే కదా అని నిర్లక్ష్యం చేస్తే ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయి. దీపావళి సమయంలో అస్తమా, సీవోపీడీ రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

\- డాక్టర్ కృష్ణమూర్తి, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్

దుకాణాలు 187.. దరఖాస్తులు 125 !

● నగరంలో ఆరు ప్రాంతాల్లో బాణసంచా అంగళ్లు
● వీఆర్సీ మైదానంలో ఏర్పాటుకు పోటీ
● లక్కీడిప్ ద్వారా షాపుల కేటాయింపు



బాణసంచా విక్రయ దుకాణాలకు సంబంధించి లక్కీడిప్ తీస్తున్న వ్యాపారి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో బాణసంచా దుకాణాల కేటాయింపునకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో లక్కీడిప్ నిర్వహించారు. ఆర్డీవో అనూష సెలవుపై వెళ్లడంతో కార్యలయ ఏవో నిర్మలానందబాబ,నవాబుపేట సీఐ వేణు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్కీడిప్ నిర్వహించారు. నగరంలో మొత్తం ఆరు ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వాటిలో వీఆర్‌సీలో 41 షాపులు, వైఎంసీ మైదానంలో 36, ఆర్ఎస్ఆర్ స్కూలు మైదానంలో 27, చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని ఖాళీ మైదానంలో 53, బీవీఎస్ స్కూల్ మైదానంలో 5, గోషామహల్ ప్రాంతంలో 25 షాపులను కలిసి మొత్తం 187 దుకాణాలను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే దరఖాస్తులు 125 మాత్రమే వచ్చాయి. ఇందులో ఎక్కువ మంది వ్యాపారులు వీఆర్‌సీ మైదానంలో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకొన్నారు. జీఎస్టీ చెల్లించిన వ్యాపారులకు మాత్రమే దుకాణాలకు అనుమతి ఉంటుందని ఏవో నిర్మలానందబాబ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ డీటీ నాజర్, ఆర్డీవో కార్యలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దిద్దుబాటుకు అవకాశం ఎప్పుడో..!

● స్మార్ట్ రైస్ కార్డుల్లో కుప్పలు తెప్పలుగా తప్పులు
● సచివాలయాల్లో జవాబు చెప్పని సిబ్బంది
● తలలు పట్టుకుంటున్న కార్డుదారులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాల నియంత్రణ, పారదర్శకత కోసం తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డులు తప్పులు తడకలుగా ఉన్నాయి. వీటిని సరిచేసుకునే వెసులుబాటు లేకపోవటంతో కార్డుదారులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. సచివాలయాల్లో తప్పులు దిద్దుకునే ఏర్పాటు చేశామని అధికారులు ప్రకటించారు. అయితే సచివాలయ సిబ్బంది తప్పుల సవరణకు సంబంధించి తమకు ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదని, ఆప్షన్ వస్తే తెలియచేస్తామని చెబుతున్నారు. దీంతో స్మార్ట్ రైస్ కార్డుల్లో తప్పులు ఎప్పటికి సరిదిద్దుతారో..? అసలు దిద్దతారో... లేదో.. అనే ఆందోళనలో కార్డుదారులు ఉన్నారు. జిల్లాలో పంపిణీ చేసిన స్మార్ట్ రైస్ కార్డుల్లో కొన్నింటిలో కుటుంబసభ్యుల పేర్లు మారిపోవడం, అసలు పేర్లే లేకపోవడం, చిరునామా తప్పుగా ముద్రిత మవడం, ఊర్లపేర్లు తప్పులుగా పడటం చోటుచేసుకున్నాయి. దీంతో కార్డుల్లో తప్పులు సరిచేసుకునేందుకు కార్డుదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

● 7.10లక్షల కార్డులు

జిల్లాకు 7,10,998 స్మార్ట్ కార్డులు వచ్చాయి. రేషన్ షాపుల వారీగా, సంబంధిత సచివాలయాల వారీగా ఈ కార్డులను చేర్చారు. జిల్లాలో 1513 రేషన్ షాపుల ద్వారా కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. తొలుత సచివాలయాల ద్వారా, తరువాత రేషన్ డీలర్ల ద్వారా వీటిని పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఇంతవరకు పూర్తిగా పంపిణీ కాలేదు.ప్రతీ సచివాలయంలో 100 నుంచి 150 కార్డుల వరకు పంపిణీ కాలేదని సమాచారం



కార్యదర్శులు పనిచేస్తేనే పంచాయతీలకు ఆదాయం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కష్టపడి పని చేస్తేనే పంచాయతీలకు ఆదాయం వస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నెల్లూరులో శుక్రవారం డీపీవో ఆధ్వర్యంలో జిల్లాస్థాయి డిప్యూటీ ఎంపీడీవో, డీఎల్‌పీవో, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్‌పై ప్రధానంగా అధికారులకు ఆయన సలహాలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, లేఅవుట్‌దారులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రతి లేఅవుట్‌ను చట్టబద్ధం చేసుకునేందుకు ఎల్ఆర్ఎస్ ఉపయోగపడుతుందన్నారు. ప్రజల సౌలభ్యం కోసం సీఎం చంద్రబాబు ఈ స్కీమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మంత్రి నారాయణ సహకారంతో నుడా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ తీసుకొచ్చేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. చాలా మంది ఈ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. నుడా పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవడం లేదని పేర్కొన్నారు. అలాంటి లేఅవుట్‌దారులను గుర్తించి ఈస్కీమ్‌ను ఉపయోగించుకునేలా చూడాలని కోరారు. ఈవిషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, నుడా అధికారులు హిమబిందు, కాలేషా, చంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల జీవో విడుదల చేయాలి

● లేకుంటే 23 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీవో విడుదల చేయాలని, లేని పక్షంలో ఈనెల 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. శుక్రవారం నెల్లూరులో నిర్వహించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై సీఎం అనుమతులు ఇచ్చినా, ప్రభుత్వంలో కొంతమంది ఉన్నతాధికారుల వైఖరితో జాప్యం జరుగుతుందని తెలిపారు. ఇందుకు నిరసనగా ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా 123 డిపోల్లోనూ, నాలుగు వర్క్ షాపుల వద్ద ఎర్రబ్యాడ్జీలతో ధర్నాలు చేపడతామని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం అనంతరం గత ఆరేళ్లుగా వివిధ విభాగాల్లో వేలాదిమంది ఉద్యోగుల పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికే రెండు వేలమంది ఉద్యోగులు పదోన్నతులు లేకుండానే ఉద్యోగవిరమణ చేసి ఆర్థికంగా నష్టపోయారని ఆయన వివరించారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కూడా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. స్త్రీశక్తి పథకం వల్ల ఉద్యోగులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగాలంటే వెంటనే మూడువేల బస్సులు కొనుగోలు చేయడంతోపాటు పదివేల ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీఈయూ జోనల్ కార్యదర్శి దాసరి బాబూశామ్యూల్, జిల్లా అధ్యక్షుడు వీ.యుగంధర్, కార్యదర్శి ఓవీ.ప్రసాద్, జోనల్ జాయింట్ సెక్రటరీ వీ.శ్రీనివాసులురెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, కార్యదర్శి బీ.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ లేని హెచ్‌ఎం

● మనుబోలు మోడ్రన్ స్కూల్లో వసతుల కరువు
● అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



విద్యార్థులతోపాటు నేలపై కూర్చుని పాఠాలు చెబుతున్న ప్రధానోపాధ్యాయుడు

మనుబోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటో చూశారా..? పాఠశాల వరండాలో నేలపై కూర్చుని ప్రధానోపాధ్యాయుడు ఐదోతరగతి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. ఆయన కూర్చునేందుకు కుర్చీలేదు. పిల్లలకూ బల్లలు లేవు. రికార్డులు పెట్టుకునేందుకు డెస్కులు లేవు. అంతెందుకు.. రాసి చూపించేందుకు బ్లాక్ బోర్డులు లేవు. అంతేకాదండయ్... ఐదో తరగతికి ప్రత్యేక తరగతి గదంటూ లేదు. ఈ వరండానే వారికి దిక్కు. ఇంతకీ ఇదెక్కడంటారా..? మండల కేంద్రమైన మనుబోలులోని మోడ్రన్ ప్రైమరీ స్కూలు.

● నాడు- నాడు పథకానికి దూరం

గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పాఠశాలలను బాగుచేశామని ఊదరగొట్టింది. గత ఐదేళ్లలో ఒక్క రూపాయికి ఈ పాఠశాలకు ఖర్చు చేయలేదు. నాడు-నేడు పథకానికి ఈ పాఠశాల నోచుకోలేదు. పాఠశాలకు గ్రీన్‌బోర్డులు ఇవ్వలేదు. టీవీ లేదు. ఫ్యాన్లు, లైట్లు ఇవేమీ లేవు. ఈ పాఠశాలలో 63మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఒక్క తరగతికి కూడా బెంచీలు లేవు. బాత్రూమ్‌లు సరిగా లేవు. కిటికీలు ఉన్నా తలుపులు లేవు. వర్షం వస్తే పాఠశాల తడిసి పోతుంది. కనీసం పిల్లలకు మంచినీరు అందించే ఆర్‌వో మిషన్ కూడా లేదు.ఇటీవల పాఠశాల ప్రహరీ గేట్లు దెబ్బతిన్నాయి.

● వసతులు చూడకనే...

ఈ పాఠశాలలో కనీస వసతులు ఉన్నాయా..? లేవా..? అని చూడకుండానే కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులు సమీపంలోని నాలుగు పాఠశాలలను ఇందులో కలిపారు. ఈ పాఠశాలను మోడ్రన్ ప్రైమరీ స్కూల్‌గా మార్చారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే పిల్లలను స్కూలుకు తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు నానా తంటాలు పడ్డారు. పాఠశాలలో వసతులు సరిగా ఉంటేనే కదా...? తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపుతారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు, పాలకులు స్పందించి మోడ్రన్ ప్రైమరీ స్కూలులో వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఇంతకుముందు ఇద్దరు టీచర్లు ఉండగా, తాజాగా మరో ముగ్గురిని ఇక్కడ నియమించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

వివరాలు 10లో..

WANTED

నెల్లూరు జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిపై ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన డిప్లొమా EEE మరియు ITI ఎలక్ట్రీషియన్ అభ్యర్థులు కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి.

8500779956
9494556004

యూకో బ్యాంక్

అసెట్ మేనేజ్‌మెంట్ శాఖ, (2804) నం. 6-3-1108, గ్రౌండ్ ఫ్లోర్, నవభారత్ ఛాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500082 (తెలంగాణ)

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002లోని రూల్ 9(1) క్రింద బ్యాంక్‌కు చార్జ్ చేయబడిన చర & స్థిరాస్తుల అమ్మకం.

SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(2) బ్యాంక్ యొక్క అధీకృత అధికారి డిమాండ్ ప్రకటన జారీ చేశారు మరియు ఆ తర్వాత SARFAESI చట్టం 2002లోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ప్రజల నుండి బ్యాంక్ బకాయిలు వసూలు చేయడానికి రుణగ్రహీతలు/హామీదార్ల యొక్క దిగువ వివరించిన ఆస్తులను విక్రయించడానికి అధీకృత అధికారి హోదాలోని దిగువ సంతకందారు నిర్ణయించారు.

రుణగ్రహీత/ హామీదారు పేరు & చిరునామా	1) డిమాండ్ ప్రకటన తేది 2) స్వాధీనతా తేది 3) ప్రస్తుత బకాయిలు	ఇ-వేలం తేది & సమయం
1) మెస్సర్స్ దాన దుర్గలు రా & బాయిల్డ్ రైస్‌మిల్, 3/173, దూర్జటి నగర్, గూడూరు, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 524101, భాగస్వామి: 1) శ్రీ బుడిగి శ్రీనివాసులు తండ్రి రాధాకృష్ణయ్య, నివాసం: 3/169/75, జనార్దన్ రెడ్డి కాలని, గూడూరు, SPSR నెల్లూరు జిల్లా; మరియు: డి.నం.5-1/6, నాయుడుపేట, SPSR నెల్లూరు జిల్లా; భాగస్వామి: 2) శ్రీమతి బుడిగి ధనలక్ష్మి భర్త బుడిగి శ్రీనివాసులు, నివాసం: 3/169/75, జనార్దన్ రెడ్డి కాలని, గూడూరు, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా; మరియు: డి.నం.5-1/6, నాయుడుపేట, SPSR నెల్లూరు జిల్లా; 3) శ్రీమతి కాపులూరి సులోచనమ్మ భర్త స్వర్గీయ మల్లికార్జున రావు, డి.నం.2-6-157, రైల్వే ఫీడర్ రోడ్డు, కొవ్వూరు, కొవ్వూరు మండలం, నెల్లూరు జిల్లా.	1) 24.10.2013 2) 02.01.2014 3) 30.09.2025 నాటికి రూ.5,38,06,424/- ప్లస్ తదుపరి వడ్డీ మొత్తంతో పాటు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు. చార్జీలు వగైరా	11.11.2025 (ఉ.11:00 గం. నుండి సా.05:00 గం. వరకు 10 నిమిషాల ఆటో ఎక్స్‌టెన్షన్‌తో)

ఆస్తి వివరణ: SPSR నెల్లూరు జిల్లా, గూడూరు మండలం, తూర్పు గూడూరు, గూడూరు మునిసిపాలిటీ, దూర్జటినగర్‌లోని సర్వే నం.953/1, వార్డు నం.3, పట్టా నం.315, డి.నం.173 వద్దగల 140 అంకణములు లేదా 864 చ.గజాల విస్తీర్ణ రైస్ మిల్ కలిగిన ఆస్తి. సరిహద్దులు: జె. కృష్ణయ్య మరియు ఇతరుల ఖాళీ సైట్, దక్షిణం: చంద్రారెడ్డికి చెందిన గ్రౌండ్‌నట్ మిల్ సైట్, తూర్పు: చంద్రారెడ్డి ఇల్లు, పశ్చిమం: వెంకట కృష్ణారెడ్డి మరియు ఇతరుల ఖాళీ సైట్ (సేల్ డీడ్ నం.3135/2007 తేది 23.08.2007)

రిజర్వు ధర రూ.56.51 లక్షలు , బయానా: రూ.5.65 లక్షలు బిడ్ గుణాంకం రూ.1.00 లక్షల

బయానా (ఇఎండి): దాఖలుకు అఖరి తేది:10.11.2025న సా.5.00గం.లవరకు.
ఆస్తి తనిఖీ తేది:29.10.2025న ఉ.10.00గం. నుండి సా.5.00గం.వరకు.

నియమ నిబంధనలు: 1.అమ్మకం సవివరమైన నియమనిబంధనలు దిగువ వెబ్‌సైట్/వెబ్ పోర్టల్‌లో ఉంటాయి/ప్రచురించబడతాయి: I) https://baanknet.com II) https://www.ucobank.com. 2. ఆస్తి(లు) ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా & అక్కడ ఏమున్నదో అది & ఏది అక్కడ ఉంటే అదే ప్రాతిపదికన విక్రయించబడుచున్నాయి. 3. ఇందులో పైన తెలిపిన ఆస్తుల వివరణలో నిర్దేశపరిచిన సెక్యూర్డ్ ఆస్తుల వివరాలు అధీకృత అధికారి ఉత్తమ పరిజ్ఞానం మేరకు తెలియజేయబడినవి, అయితే ఈ ప్రకటనలో ఏదేని తప్పుకు, తప్పుడు నివేదికకు లేదా వదిలి పెట్టిన దానికి సంబంధించి అధీకృత అధికారి జవాబుదారీ కాదు. 4. వేలం అమ్మకం వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా 11.11.2025న ఉ.12:00 గం. నుండి సా.5:00 గం.మధ్యన ఒక్కోదానికి పది నిమిషాల అపరిమిత విస్తరణతో ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్డింగ్ నిర్వహించబడుతుంది. 5. కాగోరు బిడ్డర్లు ఇ-వేలం వెబ్‌సైట్‌లో తమకు తాముగా నమోదు కావలసి ఉంటుంది మరియు https://baanknet.com లో పొందుపరిచిన మార్గదర్శకాల ప్రకారం సర్వీస్ ప్రొవైడర్ ద్వారా కల్పించబడిన వర్చువల్ వాలెట్‌లో బయానాను జమ చేయవలెను. 6. గెలుపొందిన బిడ్డరు ద్వారా బ్యాంకుకు అమ్మకం ప్రతిఫలం చెల్లింపు ఆదాయ పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1ఎ క్రింద TDSకు లోబడి ఉంటుంది మరియు బిడ్ మొత్తంలో 75 % మొత్తాన్ని జమచేసే సమయంలో గెలుపొందిన బిడ్డరు ద్వారా మాత్రమే TDS చెల్లించబడాలి మరియు ఇది పైన తెలిపిన అమ్మకం ప్రతిఫలం మొత్తంగా ఉంటుంది. 7.బిడ్ దాఖలు చేసే ముందు ఆస్తి మరియు స్పెసిఫికేషన్ గురించి తనిఖీ చేసుకొని తమకుతాము సంతృప్తి చెందుట బిడ్డరుదారుల బాధ్యతగా ఉంటుంది. కాగోరు కొనుగోలుదారు ముందస్తు అనుమతితో 29.10.2025న లేదా అలోగా ఉ.10:00 గం. నుండి సా.5:00 గం. మధ్య ఆస్తిని తనిఖీ చేసుకోవచ్చును. సంప్రదించండి: శ్రీ రాజేష్ శ్రావణ్ విశాలె, మొబైల్ నం.9822479428, 8337063850 & శ్రీ వెంకటేశ్ : 9059021407, ఇమెయిల్: asmahy@ucobank.co.in 8. అధీకృత అధికారి ఉత్తమ సమాచారం మేరకు, ఆస్తిపై భద్రతా ప్రయోజనాన్ని ప్రభావితం చేసే తాకట్టు రుణభారాలు లేవు. అయితే, కాగోరు బిడ్డర్లు తమ బిడ్‌ను దాఖలు చేసే ముందు ఆస్తిని ప్రభావితం చేసే ఆస్తి టైటిల్, క్లెయిము/ హక్కులు/ బకాయిలు/ తాకట్టు రుణభారాలు వగైరాకు సంబంధించి తమకుతాము సొంత స్వతంత్ర విచారణలు/ తనిఖీలు చేసుకోవలెను. ఈ ఇ-వేలం ప్రకటన బ్యాంక్ లేదా అధీకృత అధికారి తరఫున ఎలాంటి నిబద్ధతను లేదా ప్రాతినిధ్యాన్ని కలిగి ఉండదు మరియు కలిగి ఉన్నట్లుగా పరిగణించబడదు. బ్యాంక్‌కు తెలిసిన లేదా తెలియని అన్ని ప్రస్తుత మరియు భవిష్యత్తు తాకట్టు రుణభారాలతో ఆస్తి విక్రయించబడుచున్నది. అధీకృత అధికారి / సెక్యూర్డ్ క్రెడిటార్ ఏ విధమైన మూడవ పార్టీ హక్కులు/ క్లెయిములు/దార్జీలు/లీన్స్/ బకాయిలు/ తాకట్టు రుణభారాలకు ఏ విధంగానూ బాధ్యత వహించరు. 9. ఈ ప్రకటన ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు, హామీదారు(ల)కు మరియు సాధారణ ప్రజలకు కూడా వర్తిస్తుంది.

తేది: 17.10.2025 ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి , యూకో బ్యాంక్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100):	560

ఏబీవీపీ నగర కమిటీ ఎన్నిక

కావలి (టౌన్) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కావలి నగర కమిటీని శుక్రవారం స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఏబీవీపీ నె ల్లూరు జిల్లా ప్రముఖ్ గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా డాక్టర్ చెరుకూరు ప్రభాకర్, సహాధ్యక్షుడిగా విజయ్, కార్యదర్శిగా చక్రి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంగాధర్ మాట్లాడుతూ దేశభక్తి, దేశ రక్షణ ఏబీవీపీ ప్రధాన ఉద్దేశాలన్నారు. అనంతరం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. బ్రిడ్జి కూడలి ట్రంకు రోడ్డులోని బీఆర్ అంబేదర్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హేమంత్, జిల్లా మహిళా కన్వీనర్ కృతి, జిల్లా హాస్టల్స్ విభాగం కన్వీనర్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాకేశ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

కావలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిచేసిన రాకేశ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం కావలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వీ. శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు చేవూరు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ఎంఈఎఫ్ నాయకులు మంద వెంకటేశ్వర్లు మాదిగ, అక్కిలగుంట ఏసురత్నం మాదిగ, ఎంఎస్పీ నాయకుడు కత్తి శివ మాదిగ, మనోహర్ మాదిగ, రామమోహన్ మాదిగ, చేవూరు ఆదిత్య మాదిగ, జాన్సన్ మాదిగ, శ్యామ్యూల్ మాదిగ తదతరులు పాల్గొన్నారు.

దగదర్తిలో..

దగదర్తి(బిట్రగుంట): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని వెంకటే శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. దగదర్తి మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కావలిశ్రీనివాస్ మాదిగ, కో ఇన్‌చార్జి నూనె జనార్ధన్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఎమ్మార్పీఎస్ కావలి నియోజకవర్గ ఇంచార్జి గోచిపాతల వెంకటేశ్వర్లు, తలారి రవికుమార్, మంచు తిరపతి, కప్పలనారాయణ, మావులూరి మస్తాన్, వీరనారాయణ, శీనయ్య, చంద్ర, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది

కావలి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్‌లోని గిరిజన సంక్షేమ బాలుర ఆవాస పాఠశాలలో శుక్రవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్ శ్యాం సుధాకర్ ఆధ్వర్యంలో 140 మంది విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ. రవిప్రకాష్, రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్లపాడుకు సోమశిల జలాలు విడుదలకు వినతి

లింగసముద్రం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల ప్రాజెక్టు నీటిని విడుదల చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాంశు శుక్లాను ప్రాజెక్టు ఈఈ జి మునిరత్నం కోరారు. శుక్రవారం ఈఈ మునిరత్నం, డీఈఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్యలు నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి రాళ్లపాడు ప్రాజెక్టు వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. సోమశిల నుంచి నీటిని రాళ్లపాడు ప్రాజెక్టుకు విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించి సోమశిల ఎస్ఈ ఎంవి రమణారెడ్డితో ఫోన్‌లో నీటి విడుదల గురించి మాట్లాడారు. ఈనెల 22 తర్వాత నీటి విడుదలకు తీసుకుంటారని కలెక్టర్ తెలియజేసినట్లు ఈఈ మునిరత్నం తెలిపారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

లింగసముద్రం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు మంచినీటి పథకానికి చెందిన పెంట్రాల వద్ద ఉన్న వాటర్ ట్రీట్‌మెంటు మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని మండల ఆర్‌డబ్ల్యూఎస్, మంచినీటి పథకాల ఏఈఈ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన వాటర్ ప్లాంటు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం నీటిని విడుదల చేసి 48 గ్రామాల ప్రజలకు అందిస్తామని చెప్పారు. ఏఈఈ రాజశేఖర్ వెంట పథకం నిర్వాహకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

కందుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 3న జరిగే సార్వత్రిక సమ్మెకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ పారిశుధ్య కార్మిక యూనియన్ శుక్రవారం స్థానిక మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నాయకులు ఆనందమోహన్, పులి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

24న హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం కొండపైన కల్యాణ మండపంలో ఈనెల 24న హుండీల లెక్కింపు జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు హుండీల లెక్కింపు ప్రారంభమతుందన్నారు.

ఘనంగా 16 రోజుల పండుగ

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల సమీపంలోని శ్రీదత్తాత్రేయస్వామి మందిరం వద్ద శుక్రవారం 16 రోజుల పండుగను భక్తులు జరుపుకున్నారు. దసరా పండుగ నవరాత్రుల సందర్బంగా భవానీ కంకణ దీక్ష తీసుకున్న స్వాములు శుక్రవారం అమ్మవారికి 16 రోజుల పండుగ నిర్వహించారు.

సుప్రీంకోర్టు ఘటనపై ఎమ్మార్పీఎస్ నిరసన



కందుకూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై సీనియర్ అడ్వకేట్ రాకేష్ కిషోర్ చేసిన దాడిని ఖండిస్తూ శుక్రవారం కందుకూరులో అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎంఆర్ పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లావణ్యకు వినతి పత్రాన్ని అందించారు. నిరసన ర్యాలీ లో ఎంఆర్‌పీఎస్ నాయకులు కాంతారావు మాదిగ, చదలవాడ కిట్టు, రావినూతల ముత్తుమాదిగ, వినయ్ మాదిగ, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●**ఉలవపాడు :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై బూటు విసిరి దాడిచేసిన సీనియర్ న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు శుక్రవారం మండల కేంద్రం ఉలవపాడులో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సిబ్బందికి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ముత్తమాదిగ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఆర్ మోహన్, ఐజాక్, గోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి



దారకానిపాడులో లక్ష్మయ్య నాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

గుడ్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారకానిపాడులో ఇటీవల కారుతో ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టడంతో మరణించిన యువకుడు తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడి కుటుంబాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. ఈ ప్రమాదం జరిగిన తీరును, గతంలో ఆ ఇద్దరి మధ్య జరిగిన వివాదాల గురించి మృతుని కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం మాల్యాద్రి, జనిగర్ల నాగరాజు, ఉన్నం వెంకటేశ్వర్లు, చిత్తారి మల్లికార్జున, నరాల మాలకొండారెడ్డి, చుండూరి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఇంటూరి

●**వలేటివారిపాలెం:** మండలంలోని కళవళ్లలో అబ్బూరి గంగయ్య కుమారుడు శ్రీనివాస్ వివాహానికి శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, వలేటివారిపాలెం మండల టీడీపీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు నార్నే రోశయ్య, మోదేపల్లి నారాయణ, మోదేపల్లి మాలకొండయ్య, మోదేపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

SRI SAI SCHOOL OF NURSING
Jammalapalem Village, Jaladanki Mandal,
SPSR Nellore Dt. 524 223

Go.MS.No.3/Date: 05-11-2012-AP NMC/GNT/2421/2019- Dt.17-01-2020
2025-26 సంవత్సరమునకు సంబంధించి GNM కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి.

కోర్సు	విద్యార్హత	మేనేజ్‌మెంట్ సీట్స్	గవర్నమెంట్ సీట్స్	వయస్సు
GNM	INTER ఎనీ గ్రూప్	24	36	16 సం॥ నుండి 29 సం॥ వరకు

అర్హత గల అభ్యర్థినిలు అడ్మిషన్లు కొరకు వారి ఒరిజినల్ సర్టిఫికేటేలతో వెంటనే కార్యాలయం నందు సంప్రదించగలకు.

గమనిక : SC, ST, BC (C) విద్యార్థినులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు.
మా కళాశాల నందు కోర్సు పూర్తి చేసిన వారికి హాస్పిటల్ నందు నెలకు 15,000/- రూపాయలతో ఉద్యోగ అవకాశము కల్పించబడును.

కరస్పాండెంట్ : గోసల దశరధ రామిరెడ్డి, సెల్: 9492336939, 9059643969











కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● నవంబరు 17 నుంచి విస్తృత ప్రచారం ● సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, సోషల్ వెల్ఫేర్, ఐసీడీఎస్ అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నవంబరు 17 నుంచి 30 వరకు కుష్ఠువ్యాధిపై ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. దీన్ని సమర్థవంతగా నిర్వహించేందుకు వైద్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ, వార్డుల్లో ఈ ప్రచారం చేపడుతూ ఎక్కడైనా కుష్ఠువ్యాధి కేసులు గుర్తిస్తే, వెంటనే సంబధిత ఆరోగ్య సిబ్బందికి తెలియచేయాలన్నారు. వ్యాధిగ్రస్థులు భయపడాల్సిన అవసరం లేదని, అన్నీ రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా కుష్ఠువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఈవో బాలాజీరావు , ఐసీడీఎస్ పీడీ హేమా సుజన్, సోషల్ వెల్ఫేర్ డీటీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఎంహెచ్‌వో, డీఈవో తదితరులు

బీఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ దీపావళి కానుకగా 4జీ సిమ్ ఉచితంగా అందజేయడంతో పాటు రూ.1 రీచార్జితో 30రోజులు ఫ్రీ కాల్స్, రోజూ 2జీబీ డేటా అందజేస్తున్నట్లు ఆ సంస్థ పీజీఎంటీడీ సీ.అమరేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిమ్ కోసం వినియోగదారులు ఆధార్‌కార్డుతో కస్టమర్ కేర్ సెంటర్‌లో ధ్రువీకరించుకోవాలని కోరారు. ఉచిత సిమ్, రూ.1 రీచార్జి కోసం కస్టమర్ కేర్ రిటైలర్స్, డైరెక్ట్ సెల్లింగ్ ఏజంట్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశం నవంబరు 15 వరకు ఉంటుందన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సోమవారమే దీపావళి

● కొత్త నోములు లేవు..

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దీపావళిని సోమవారం రోజే నిర్వహించుకోవాలని వేద పండితులు తెలిపారు. ఆరోజే నరక చతుర్థశి, హారతులు, దీపావళి, ధనలక్ష్మీ పూజలు కూడా జరుపుకోవాలని సూచించారు. 21వతేదీ మంగళవారం కేదారేశ్వర నోములు వ్రతాలు ఆచరించుకోవాలని తెలిపారు. ఈ ఏడాది దీపావళి అమావాస్యకు, స్వాతి నక్షత్రం, స్వాతి కార్తె లేనందున కొత్త నోములు, ఏదైనా కారణంచేత ఆగిన నోములు, సూతకం చేత ఆగిన నోములు చేయరాదని పేర్కొన్నారు. 20న సాయంత్రం 5.30 నుంచి దీపావళి, ధనలక్ష్మి పూజ నిర్వహణ శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. పితృకార్యాలు చేసేవారు 21న చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 25న నాగుల చవితి. ఆరోజు ఉదయం 7.35 నుంచి మధ్యాహ్నం 12.05 గంటలలోగా నాగేంద్రస్వామికి పుట్టలో పాలు పోయడం శుభప్రదమని వారు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి పర్వదినాలను జరుపుకోవాలన్నారు.

నగరంలో స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం నెల్లూరు నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో అధికారులు సింహపురి స్కానింగ్ సెంటర్, అండాల్ భాస్కర్ ఆసుపత్రి, విజయ ఆసుపత్రుల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రతీ స్కానింగ్ సెంటర్ పీసీపీఎన్‌డీటీ నిబంధనల ను తప్పక పాటించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే స్కానింగ్ సెంటర్‌లపై చర్య లు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సుధాకర్‌రావు, పబ్లిక్ ప్రైవేట్ మిక్స్ కోఆర్డినేటర్ హరీష్, విజయ్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ సరిత తదితరులు పాల్గొన్నారు.


స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గూగుల్ రాకపై విమర్శలు విడ్డూరం : అజీజ్



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గూగుల్ రావటంపై సంతోషం వ్యక్తం చేయాల్సిందిపోయి వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నెల్లూరులోని అజీజ్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద డేటా సెంటర్ రాష్ట్రానికి రావటం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ డేటా సెంటర్ రాష్ట్రానికి రావటంపై ప్రపంచ మొత్తం అసూయ పడుతుందన్నారు. అక్కడక్కడా వర్షానికి రోడ్లపై నీరు నిలిచినా అది కూటమి ప్రభుత్వానిదే తప్పిదమని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ఐటీపై ఉన్న అనుభవం కారణంగా ఈ డేటా సెంటర్ వచ్చిందని చెప్పారు. దాదాపు కోటి ఇళ్లకు సరఫరా చేసే విద్యుత్ గూగుల్ సెంటర్‌కు అవసమని, ఆ విద్యుత్‌ను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.అదానీ డేటా సెంటర్ పోర్టుతో కలిపి రూ. 15వేల కోట్లు మాత్రమే పెట్టుబడి పెట్టారన్నారు. అయితే గూగుల్ రూ. 1.35 వేల కోట్లు పెట్టుబడి పెడుతుందని ఆయన చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటుందని నమ్మి నిర్ధారించుకున్న గూగుల్ సంస్థ ఈ పెట్టుబడులు పెడుతుందన్నారు. వైసీపీ నేతల పిచ్చికూతలను ఎవరూ నమ్మవద్దని ఆయన హితవు పలికారు.

మట్టి ఆరోగ్యానికి జీవన ఎరువులు

- నేలలోని భాస్వరాన్ని కరిగిస్తాయి
- పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి
- కేవీకే సేద్యవిభాగం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంతో కీలకం. ఇవన్నీ పంటల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా భాస్వరం మొక్క వేర్ల పెరుగుదలకుగా పుష్పఫలాల ఏర్పాటుకు అత్యవసరం. అలాంటి భాస్వరం కలిగిన ఎరువులను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. దీంతో నేలలో స్థిరపడిపోతున్న భాస్వరం వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. అంతేకాక అంతకంతకు రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. నేలలోని ఈభాస్వరాన్ని కరిగించి, మొక్కకు ఉపయోగపడేలా చేయగలిగితే రైతులకు ఖర్చులు తగ్గుతాయి. అంతేకాక నేల ఆరోగ్యంగా ఉంటుందని చెబుతున్నారు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాసా కిరణ్‌కుమార్‌రెడ్డి. ఇందుకు సంబంధించిన విషయాలను ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా రైతులకు తెలియపరిచారు.

● పంటకు ఉపయోగపడని భాస్వరం

వ్యవసాయంలో భాస్వరం కలిగిన ఎరువులను(సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, డైఅమ్మోనియం ఫాస్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులు) రైతులు అత్యధికంగా వాడుతున్నారు. పరిశోధన ప్రకారం ఆ ఎరువుల్లో కేవలం 15 నుంచి 20శాతం వరకు మాత్రమే భాస్వరం పంటకు అందుతోంది. మిగిలిన భాస్వరం నేల లో స్థిరపడిపోతోంది. అంటే అధికశాతం పంటకు ఉపయోగపడకుండా పోతుంది.


జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

మొక్కలకు వేసిన భాస్వరం భూమిలో కొద్ది రోజుల్లోనే ఉదజని సూచిక(పీహెచ్)ను అనుసరించి వివిధ రకాలైన లభ్యంకాని భాస్వరం రూపంలోకి మారిపోతుంది. అది ఎలాగంటే ఆమ్లగుణం కలిగిఉంటే వేసిన భాస్వరం ఐరన్ లేదంటే అల్యూమినియం ఫాస్ఫేటుగా మారి మొక్కకు ఉపయోగపడడంలేదు. అలాగే క్షార గుణం కలిగిన ఉన్నప్పుడు వేసిన భాస్వరం కాల్షియం లేదంటే మెగ్నీషియం ఫాస్ఫేటుగా మారి పంటకు అందుబాటులో ఉండదు. దీంతో నేలలో భాస్వరం నిల్వలు అధికమవుతున్నాయి.

● భాస్వరం కరిగించే జీవన ఎరువులు

మట్టిలో అధికమవుతున్న లభ్యంకాని భాస్వరం నిల్వలను కరిగించి మొక్కలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జీవన ఎరువులు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఫాస్ఫేట్ సాల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) కలిగిన జీవన ఎరువులు ఉపయోగించడం వల్ల నేలలోని లభ్యం కాని భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందుబాటులోకి తీసుకొస్తాయి. ఈజీవన ఎరువు ముఖ్యంగా బాసిల్లస్ మెగథీరియం, సూడోమోనాసులను ఉపయోగించి తయారు చేస్తారు. ఇది సమర్థవంతంగా పనిచేసేందుకు సేంద్రీయ కర్బనం ఎంతో ముఖ్యం. కాబట్టి ఈజీవన ఎరువుతో సేంద్రీయ ఎరువును వాడాలి. ఈజీవన ఎరువు భాస్వరాన్ని మొక్కకు అందించడంతోపాటు మొక్కల పెరుగుదలకు అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుంది. మొక్కల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. దీనివల్ల పంట దిగుబడులు పెరుగుతాయి.

● విత్తనశుద్ధి

కిలో విత్తనానికి 10మి.లీ చొప్పున పీఎస్‌బీ జీవన ఎరువును బెల్లం జిగట పదార్థం లేదంటే గంజి జిగట పదార్థంతో కలుపుకుని గోనెసంచిలో, ప్లాస్టిక్ సంచిలో విత్తనాలతో కలిపి మెల్లగా కలియతిప్పాలి. అనంతరం పొడిగా ఉండేలా నీడలో ఆరబెట్టి పొలంలో విత్తుకోవాలి.

● నారు

లీటరు నీటికి 10మి.లీ పీఎస్‌వీ జీవన ఎరువును కలపాలి. లేదంటే 10లీటర్ల నీటికి 100మి.లీ పీఎస్‌బీ జీవన ఎరువును కలిపి అందులో 15-20 నిముషాలు మొక్కల వేర్లు పూర్తిగా మునిగేలా ఉంచుకోవాలి. ఆ తరువాత నాటుకోవాలి.

జిల్లాలో రెండో రోజూ వర్షం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం కూడా వర్షం పడింది. గురువారం జిల్లాలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించిన వెంటనే భారీ వర్షం కురిసింది. రెండోరోజైన శుక్రవారం కూడా భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ తెలియచేసినా జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం పడింది. కొంతసేపు ఎండ కాసింది.

● అల్లూరు జోరు వర్షం

అల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా అల్లూరులో జోరుగా వర్షం కురుస్తోంది. రాత్రి సమయాల్లో వర్షం భారీగా కురుస్తుండడంతో పొలాల్లో సైతం నీరు చేరుతోంది. రైతులు రబీ సీజనుకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు ప్రారంభం కావడంతో వారు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల సేకరణలో మునిగి ఉన్న అన్నదాతలకు సకాలంలో వర్షాలు కురవడం మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఇప్పటికే దుక్కి దున్ని అన్నదాతలు నారుమడులను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. వారికి ఈ వర్షాలు మరింత చేదోడుగా నిలుస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

● నేడు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఆత్మకూరులో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు స్వచ్ఛ దివస్‌లో భాగంగా హనుమాన్ జంక్షన్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలిస్తారు. అనంతరం జీఎస్టీ ర్యాలీలో పాల్గొంటారు. తదుపరి మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించే సభలో పాల్గొని 111 మంది లబ్ధిదారుల కుటుంబాలకు రూ.85.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు దుస్తులు, కిట్లు పంపిణీ చేస్తారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభిస్తారు.

20న ఏపీఎస్‌జీఆర్ ఈఏ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం లో ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరులోని టౌన్‌హాల్లో నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ. లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గసభ్యులు, తాలూకా యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులంతా హాజరు కావాలని వారు కోరారు.

చిత్రజ్యోతి

SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.



విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.



